బుధవారం
05-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 14
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అధికార రాజకీయాలు వద్దు

అంతర్జాతీయ పరిపాలన వ్యవస్థ మరింత న్యాయంగా, సమానంగా ఉండేందుకు ఆధిపత్యవాదాన్ని, అధికార రాజకీయాలను తిరస్కరించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. సమాన హక్కులు, సమాన అవకాశాలకు హామీనిచ్చే విధంగా ఆధునిక సమ సమాజ స్థాపనకు కృషిచేయాలని అన్నారు. బహుపాక్షికవాదాన్ని జిన్‌పింగ్ సమర్థించారు.

2 లో

కోడికత్తి కేసులో మరో ట్విస్ట్

- బెయిల్ మా పరిధిలో లేదన్న ఎన్ఐఏ కోర్టు
- సుప్రీంకోర్టును ఆశ్రయించాలని సూచన
- కేసు జాప్యాన్ని నిరసిస్తూ 11 నుంచి దీక్ష చేస్తానన్న శ్రీను

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కోడికత్తి కేసులో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. నాలుగు సంవత్సరాలుగా జైలులో మగ్గుతున్న నిందితుడు శ్రీనివాస్ బెయిల్‌పై విజయవాడలోని ఎన్ఐఏ కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. బెయిల్ ఇవ్వాలని నిందితుడు శ్రీనివాసరావు మరోసారి కోర్టును అభ్యర్థించాడు. బెయిల్ అంశం తమ పరిధిలో లేదని ఎన్ఐఏ కోర్టు అతడికి స్పష్టం చేసింది. బెయిల్ కోసం సుప్రీంకోర్టుకు వెళ్లాలని న్యాయస్థానం సూచించింది. గతంలో శ్రీనివాసరావుకు ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసింది. మరోవైపు లిఖితపూర్వక వాదనలు దాఖలు చేయాలని సీఎం జగన్ తరపు న్యాయవాదిని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 11కు వాయిదా వేసింది. ఇదిలా ఉండగా కేసులో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ జైల్లోనే దీక్ష చేపడతానని నిందితుడు శ్రీనివాసరావు చెప్పాడు. ఈనెల 11 నుంచి దీక్ష చేస్తానని తెలిపాడు.

మరో రూ.3 వేల కోట్ల అప్పు

90 రోజుల్లో రూ.25 వేల కోట్ల రుణ సేకరణ

మిగిలింది రూ.5వేల కోట్లే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారాన్ని అప్పుల వారంగా మార్చింది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతి మంగళవారం రిజర్వుబ్యాంకు నుంచి సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా అప్పు తీసుకురావడాన్ని క్రమం తప్పకుండా కొనసాగిస్తోంది. దీనిలో భాగంగా తాజాగా మరో రూ.3 వేల కోట్ల అప్పును రిజర్వ్ బ్యాంక్ సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా సేకరించింది. వీటిలో వెయ్యి కోట్లు 11 సంవత్సరాలకు 7.46 శాతం వడ్డీతో, మరో వెయ్యి కోట్లు 16 సంవత్సరాలకు 7.52 శాతం వడ్డీతో రుణం పొందింది. ఇంకో వెయ్యి కోట్లు 20 సంవత్సరాలకు 7.46 శాతం వడ్డీతో రుణం తీసుకుంది. ఈ మూడు వేల కోట్లతో ఇప్పటివరకూ ఆర్బీఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు రూ. 25,500 కోట్లకు చేరింది. ఇదంతా కేవలం 90 రోజుల్లో కావడం గమనార్హం. ఈ ఏడాది ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో ఇక మిగిలింది ఐదు వేల కోట్లు మాత్రమే. ప్రభుత్వ తీరును గమనిస్తుంటే మిగిలిన రూ.5 వేల కోట్లు ఈ నెలలోనే మరో రెండు మంగళవారాల్లో సేకరించే అవకాశం కనపడుతోంది. ఇక ఆగస్టు నుంచి మరలా కేంద్రం అప్పు పరిమితి పెంచితే తప్ప ఆర్బీఐ వేలంలో పాల్గొనే అవకాశం లేదు. వాస్తవానికి ఏప్రిల్ నుంచి డిసెంబరు నెల వరకు రూ.30,500 కోట్లు అప్పు చేసుకోవడానికి కేంద్రం అనుమతించగా, రాష్ట్ర ప్రభుత్వం దానిని కేవలం మూడు నెలల్లోనే పూర్తి చేసే పరిస్థితి ఏర్పడడంతో ఆగస్టు తర్వాత పరిణామాలపై అధికారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇది ఆరంభమే

పోలవరం నిర్వాసితుల సమస్యలపై పోరాటం ఆగదు

3లో

సోము వీర్రాజుకు ఘోర అవమానం

- హీనమైన పద్ధతిలో తొలగింపు
- బీజేపీ కార్యాలయంలో ఉండగానే నడ్డా ఫోన్
- కొద్దిసేపటికే పురందేశ్వరిని నియమిస్తూ ప్రకటన
- హఠాత్ పరిణామాలతో కంగుతిన్న కమలనాథులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుకు ఆ పార్టీ అధిష్ఠానం కోలుకోలేని షాక్ ఇచ్చింది. వీర్రాజుపై పార్టీలో తీవ్ర అసంతృప్తి ఉన్నప్పటికీ ఇంత అవమానకర పద్ధతుల్లో తొలగిస్తారని కమలనాథులు ఊహించలేదు. కేవలం ఫోన్ కాల్ ద్వారా సోము వీర్రాజును బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా తొలగించడం, కొద్ది గంటలకే పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శిగా ఉన్న దగ్గుబాటి పురందేశ్వరిని నియమించడం చకచకా జరిగిపోయాయి. గంటల వ్యవధిలో జరిగిన ఈ వరుస పరిణామాలతో కమలనాథులు కంగుతిన్నారు. వీర్రాజు ఏకపక్ష నిర్ణయాలతో పాటు వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై రాష్ట్ర బీజేపీలో వ్యతిరేకత తీవ్రస్థాయిలో పెరుగుతూ వచ్చింది. పార్టీలో ఒక బృందం దిల్లీ వెళ్లి అధిష్ఠానానికి నేరుగా ఫిర్యాదు చేసింది. గతంలో ప్రజాబలం ఉన్న నేత కన్నా లక్ష్మీనారాయణ పార్టీని వీడటానికి కారణం కూడా సోము వీర్రాజేనని కొందరు నేతలు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల లీగల్ సెల్ సమావేశంలో సోము వీర్రాజు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై కొందరు బీజేపీ నేతలు ఫిర్యాదు చేశారు. బీజేపీలో ఉంటే గెలవలేమనే రీతిలో సోము వీర్రాజు చెప్పడం, తాను వేరే పార్టీలోకి వెళ్లి ఉంటే గెలిచేవాడిననడాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే అధ్యక్షుడి మార్పు తప్పదని భావించిన అధిష్ఠానం సోము వీర్రాజును పక్కనపెట్టి...పురందేశ్వరికి పగ్గాలు అప్పగించింది. సోము వీర్రాజుకు జేపీ నడ్డా స్వయంగా ఫోన్ చేసి 'మీ టర్మ్ అయిపోయింది.. మిమ్మల్ని తప్పిస్తున్నాం.. రాజీనామా చేయాలి' అని సూచించారు. బీజేపీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు

- మిగతా 2 లో

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి

సోము, బండి తొలగింపు

2లో

సహకార వ్యవస్థకు జీవం

- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి
- చిత్తూరులో అమూల్ డెయిరీకి భూమి పూజ
- చంద్రబాబు, పవన్‌పై విరుచుకుపడ్డ సీఎం

విశాలాంధ్ర-చిత్తూరు: రాష్ట్రంలో నిర్వీర్యమైన సహకార రంగానికి జీవం పోస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. చిత్తూరు జిల్లా కేంద్రంలోని విజయ సహకార డెయిరీ ప్రాంగణంలో అమూల్ డెయిరీ నిర్మాణానికి సీఎం జగన్ మంగళవారం భూమి పూజ

- మిగతా 2 లో

షర్మిల సేవలు ఏపీకా...తెలంగాణకా?

- కాంగ్రెస్‌లో చేరికకు సిద్ధం
- టి.కాంగ్రెస్ నేతలతో భేటీలు
- బలం చేకూర్చిన కేవీపీ వ్యాఖ్యలు
- షర్మిలకు ఏపీ కాంగ్రెస్ ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరిక దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. షర్మిల కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తనకు సమాచారం ఉందని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు చేసిన వ్యాఖ్యలు దీనికి బలం చేకూరుస్తున్నాయి. ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యనేతలతో షర్మిల వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. షర్మిల విధించిన షరతులకు కాంగ్రెస్ అధిష్ఠానం అంగీకరిస్తే... చేరిక తథ్యమని తెలుస్తోంది. తాను తెలంగాణ రాజకీయాలకే పరిమితమై ఉంటానని, ఏపీ రాజకీయాల్లో జోక్యం చేసుకోబోనని ట్విట్టర్ వేదికగా షర్మిల ఇటీవల స్పష్టం చేశారు. తన రాజకీయ జీవితమంతా తెలంగాణ రాష్ట్ర ప్రజలతో ముడిపడి ఉంటుందని, తెలంగాణ కోసమే పని చేస్తానని తేల్చిచెప్పారు. షర్మిల తన రాజకీయ విమర్శలు బీజేపీ, టీఆర్ఎస్‌కే పరిమితమయ్యాయి. కాంగ్రెస్‌పై ఎలాంటి విమర్శలూ చేయలేదు. ఇటీవల కాలంలో ఆమె తెలంగాణలో ఎలాంటి రాజకీయ కార్యక్రమాలూ చేపట్టలేదు. దీంతో షర్మిల తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడంగానీ లేదా పొత్తుకు సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది. షర్మిల పార్టీ

- మిగతా 2 లో

మండుతున్న మిర్చి

- అధిక ధరతో ఘాటెక్కిస్తున్న వైనం
- కిలో రూ.100 పైనే
- అల్లం, ఇతర కూరగాయలదీ అదే దారి

న్యూదిల్లీ : దేశంలో వినియోగదారులకు అధిక ధరల ఘాటెక్కించడం ఇప్పుడు మిర్చి వంతు అయ్యింది. ఇప్పటికే టమాటా ధరలు దారెత్తిస్తున్న తరుణంలో తాజాగా పచ్చిమిర్చి ధర సైతం తారస్థాయికి చేరింది. ప్రజలు కొనకుండానే పచ్చిమిర్చి వారికి కన్నీళ్లు తెప్పిస్తోంది. గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా టమాటా ధరలు విపరీతంగా పెరుగుతున్న సంగతి తెలిసిందే. దాదాపు దేశవ్యాప్తంగా 160 రూపాయలకు కేజీ టమాటాలు వస్తున్నాయి. ఒక నెల రోజుల కిందట రూ.100కు ఎనిమిది కిలోల చొప్పున టమాటాలు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు కేజీకి రూ.160 పలుకుతోంది. అయితే టమాటా ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో సామాన్యులకు మరో షాక్ తగిలింది. పచ్చిమిర్చి కూడా భారీగా పెరిగింది. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో కిలో మిర్చి ధర రికార్డు స్థాయిలో రూ.300కు చేరింది. అలాగే అల్లం ధర కూడా అదే స్థాయిలో చేరింది. త్వరలోనే వీటి ధర 400 రూపాయలకు చేరే అవకాశం ఉందని వ్యాపార

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అవునయ్యా.. ఆఖరుకి సర్పంచులను కూడా రోడ్లు పట్టించిన ఘనత మా ప్రభుత్వానిదే దానికెందుకు నవ్వడం!

అధికార రాజకీయాలు వద్దు

- ఆధునిక సమసమాజ స్థాపనకు కృషి చేయాలి
- శాంతి భద్రతలను పరిరక్షించడం మన బాధ్యత
- ఎస్‌సీఓ సదస్సులో జిన్‌పింగ్

బీజింగ్: అంతర్జాతీయ పరిపాలన వ్యవస్థ మరింత న్యాయంగా, సమానంగా ఉండేందుకు ఆధిపత్యవాదాన్ని, అధికార రాజకీయాలను తిరస్కరించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. సమాన హక్కులు, సమాన అవకాశాలకు హామీనిచ్చే విధంగా ఆధునిక సమ సమాజ స్థాపనకు కృషిచేయాలని అన్నారు. బహుపాక్షికవాదాన్ని జిన్‌పింగ్ సమర్థించారు. అంతర్జాతీయ పరిపాలన వ్యవస్థ మెరుగవ్వాలన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన షాంఘై సహకార సంఘం (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో వీడియో లింక్ ద్వారా జిన్‌పింగ్‌తో పాటు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసి, బెలారస్ అధ్యక్షుడు అలగ్జాండర్ లుకాషెంకో, కజకస్తాన్ అధ్యక్షుడు ఖాసీం జోమార్ట్ టోకాయేవ్ తదితరులు పాల్గొన్నారు. జిన్‌పింగ్ మాట్లాడుతూ డిజిటల్ కరెన్సీకి సంబంధించి సహకారాన్ని పెంచుకోవాలని, ఎస్‌సీఓ అభివృద్ధి బ్యాంకు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయాభివృద్ధి పథకం అమలునకు అన్ని వర్గాలతో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధంగా ఉందని అన్నారు. రక్షణ వాదం వద్దన్నారు. ఏకపక్షంగా ఆంక్షలు విధించడాన్ని మానుకోవాలని సూచించారు. ఆర్థికంగా కట్టడి చేసేందుకు జాతీయ భద్రతను అస్త్రంగా వాడటాన్ని వ్యతిరేకించాలన్నారు. గోడల నిర్మాణాన్ని అడ్డుకోవాలని, పరిశ్రమలు, సరఫరా గొలుసులకు అంతరాయం కలిగించడం వంటివి సరికాదని హితవు పలికారు. పరస్పర ప్రయోజనాలపై దృష్టితో సహకారాన్ని బలపర్చుకోవాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ ఎస్‌సీఓ దేశాల బాధ్యతని జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. పరస్పరం విశ్వాసాన్ని పెంచుకోవాలని హితవు పలికారు. తమ మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు భాగస్వామి దేశాలకు అనుమతిచ్చేందుకు, తమ అభివృద్ధి అనుభవాన్ని పంచుకునేందుకు చైనా సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రాంతీయ శాంతి, భద్రతల పరిరక్షణకు కృషిచేయాలని, దేశాలు పరస్పరం సమాచారాన్ని, పరిజ్ఞానాన్ని పంచుకోవాలని, ప్రజాసంబంధాలు మెరుగవ్వాలని, ఆర్థిక పురోగతిలో ఎస్‌సీఓ సహకార గతి పెరగాలని జిన్‌పింగ్ సూచనలు చేశారు. బెల్ట్ అండ్ రోడ్ (బీఆర్ఐ) ప్రాజెక్టుకు సంబంధించి వివిధ దేశాలతో సహకారాన్ని పెంచుకోవడమే కాకుండా అభివృద్ధి వ్యూహాలు, ప్రాంతీయ సహకార పథకాలకు కసరత్తులు ఉమ్మడిగా జరగాలని పిలుపునిచ్చారు. శాంతి, సుస్థిరత, అభివృద్ధి విషయంలో పరస్పర ప్రయోజనాల దృష్ట్యా చర్యలు ఉన్నప్పుడు ఆ ప్రక్రియ ఆగబోదని జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. వ్యూహాత్మక చర్చలు, సహకారాన్ని పెంపొందించుకోవాలని, పోటీని నివారించేందుకు సహకారాన్ని ప్రోత్సహించేలా భిన్నాభిప్రాయాల నివారణకు చర్చలు జరపాలని సూచించారు. పరస్పర ప్రయోజనాలను గౌరవించుకోవాలని, అభివృద్ధి సాధనకు సహకారించుకోవాలని ఎస్‌సీఓ దేశాలకు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు.

అంతర్జాతీయ వ్యవహారాల్లో ఎస్‌సీఓది కీలకపాత్ర : పుతిన్

అంతర్జాతీయ వ్యవహారాల్లో ఎస్‌సీఓ కీలక పాత్ర పోషిస్తోందని, శాంతి సుస్థిరతల స్థాపనకు గణనీయమైన తోడ్పాటును అందిస్తోందని, తన సభ్యదేశాల సుస్థిర ఆర్థిక వృద్ధికి హామీనిస్తోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు.

ఎస్‌సీఓ ఫ్రేమ్‌వర్క్ పరిధిలో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలపర్చేందుకు, తోడ్పాటును పెంచుకునేందుకు ప్రస్తుత ఎస్‌సీఓ కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ స్టేట్ రూపొందించిన నివేదికలు, నిర్ణయాల ప్యాకేజి ఎంతగానో దోహదమవుతాయన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. బెలారస్‌ను ఎస్‌సీఓ చేర్చడానికి మద్దతిచ్చారు.

అందరికీ ప్రయోజనాత్మకం: ఇరాన్

టెహ్రాన్: షాంఘై సహకార సంఘం (ఎస్‌సీఓ) సభ్యత్వంపై ఇరాన్ హర్షం వ్యక్తం చేసింది. ఇది సానుకూల పరిణామని పేర్కొంది. ఎస్‌సీఓ సభ్యత్వం వల్ల ఆర్థికాభివృద్ధి, ప్రాంతీయవాదాన్ని పెంపొందించుకోగలమని తెలిపింది. ఈ పరిణామం ఇరాన్‌కు, ఇతర ఎస్‌సీఓ సభ్యదేశాలకూ ప్రయోజనకరంగా పరిణమిస్తుందని వెల్లడించింది. సభ్యదేశాల మధ్య వాణిజ్య సహకారాన్ని పెంపొందించడంతో పాటు సంబంధాలను బలపర్చుకునేందుకు, నిర్మాణాత్మకంగా ముందుకెళ్లేదుకు దోహదమవుతుందని పేర్కొంది. ఎస్‌సీఓ సభ్యత్వంపై బిల్లును ఇరాన్ పార్లమెంటు 2022, నవంబరులో ఆమోదించగా, ఇందుకు భారీగా మద్దతు లభించింది.

అఫ్గాన్‌లో మహిళలపై మితిమీరిన ఆంక్షలు

ఇస్లామాబాద్: గతంలో వలే కాకుండా అఫ్గానిస్తాన్‌లో ఆధునిక పరిపాలన అందిస్తామన్న తాలిబన్ పాలకుల హామీలు గాలి మాటలుగా పరిణమించాయి. ఇంటి గడప దాటేందుకు వీల్లేని విధంగా ఒకదాని తర్వాత ఒకటిగా మహిళలపై ఆంక్షలను తాలిబన్ ప్రభుత్వం విధిస్తోంది. బాలికలు, మహిళల హక్కులు, స్వేచ్ఛను హరిస్తోంది. బహిరంగ ప్రదేశాల్లో తిరిగేందుకు, చదువుకునేందుకు, ఉద్యోగం చేసేందుకు వీల్లేకుండా చేసింది. పార్కులు, జిమ్‌లకు వెళ్లకుండా మహిళలను నిషేధించింది. మీడియా స్వేచ్ఛను హరించింది. తాజాగా మహిళల బ్యూటీ సెలూన్లపై నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఎలాంటి కారణాలు తెలుపకుండా నెలరోజుల్లోగా వ్యాపారాలనూ మూసివేయాలని వ్యాపారులకు ఆదేశాలిచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో విమర్శలు వస్తున్నాగానీ తీరు మార్చుకోని తాలిబన్ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ దేశాన్ని ఏకాకిని చేస్తోంది. ఆర్థిక వ్యవస్థ పతనమై తీవ్రమైన మానవతా సంక్షోభం నెలకొన్న పరిస్థితుల్లోనూ రకరకాల ఆంక్షలతో మహిళలను ఇబ్బంది పెడుతోంది. తాజా ఆంక్షల గురించి అఫ్గాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి మహమ్మద్ సిద్దీఖ్ ఆఖిఫ్ మహాజర్ ప్రకటించారు. దీనికి సంబంధించి వివరాలను వెల్లడించలేదుగానీ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న ప్రభుత్వ లేఖపై స్పష్టత ఇచ్చారు. జూన్ 24వ తేదీతో వెలువడిన ప్రభుత్వ లేఖ ప్రకారం నెల రోజుల్లోగా వ్యాపారాలు మూసివేయాలని రాజధాని కాబూల్‌తో పాటు అన్ని ప్రాంతాల్లోని సెలూన్ల యజమానులకు ఆదేశాలు అధినేత హిబాతుల్లా అఖుండ్‌జాదా పేరిట జారీ అయ్యాయి. గడువు ముగిసిన తర్వాత వ్యాపారాలు మూసివేసినట్లు ధ్రువీకరిస్తూ నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు పేర్కొన్నాయి. అఫ్గాన్ మహిళల జీవితాలలో మెరుగుదల కోసం తమ ప్రభుత్వం తగు విధంగా చర్యలు తీసుకుంటుందని హిబాతుల్లా ఇటీవల వక్కాణించారుగానీ అందుకు పూర్తి విరుద్ధంగా దేశంలో పరిస్థితులు ఉన్నాయి. 2021 ఆగస్టులో అమెరికా, నాటో దళాల నిష్క్రమణ తర్వాత అఫ్గాన్ తాలిబన్ల వశమైంది.

మండుతున్న మిర్చి

(మొదటిపేజీ తరువాయి)

వర్గాలు పేర్కొంటున్నాయి. మిర్చిని ఎక్కువగా సాగు చేసే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రైతులు ఈ ఏడాది ఇతర పంటలకు మళ్లడంతో సరఫరా తగ్గింది. దీంతో మిర్చి ధరలు పెరిగినట్లు చెబుతున్నారు. ఇక తమిళనాడులోని కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్‌లో పచ్చిమిర్చి కిలో రూ.100కు చేరుకుంది. అల్లం, పచ్చి బఠానీ తదితర కూరగాయల ధరలు రెండింతలు పెరిగాయి. ఆంధ్రా, కర్నాటక తదితర రాష్ట్రాల నుంచి కూరగాయల దిగుబడి తగ్గిన కారణంగా ఇటీవల టమాటా ధరలు రికార్డు స్థాయిలో పెరిగిన విషయం తెలిసిందే. ఆ తరహాలోనే గత నెల ప్రారంభంలో కిలో రూ.30 విక్రయించిన పచ్చిమిర్చి... ప్రస్తుతం మూడింతలు పెరిగి రూ.100కు, చిల్లర దుకాణాల్లో రూ.120 నుంచి రూ.130 వరకు విక్రయిస్తున్నారు. కోయంబేడు మార్కెట్‌కు రోజుకు వంద టన్నులకు పైగా పచ్చిమిర్చి దిగుబడి అవుతుంది. అయితే ప్రస్తుతం 80 టన్నుల మేరకే వస్తున్నటు వ్యాపారులు తెలిపారు.

సహకార వ్యవస్థకు జీవం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. అనంతరం చిత్తూరు పోలీస్ మైదానంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై విమర్శలు గుప్పించారు. ప్రతిష్ఠాత్మక చిత్తూరు సహకార విజయ డెయిరీని చంద్రబాబు తన స్వార్థం కోసం పథకం ప్రకారం మూసివేశారని జగన్ విమర్శించారు. అనేక సహకార ఫ్యాక్టరీలను నష్టాల్లోకి నెట్టి వేలాదిమంది కార్మికుల పొట్ట కొట్టారని ఆరోపించారు. చిత్తూరు జిల్లాలో పాడి రైతులకు అండగా ఉంటూ రోజుకు రెండు లక్షల లీటర్ల వరకు పాల సేకరణ చేస్తున్న డెయిరీని మూసివేసేందుకు చంద్రబాబు భారీ కుట్ర అమలు చేశారన్నారు. ప్రణాళిక ప్రకారం పాల సేకరణ తగ్గిస్తూ నష్టాలు చూపి...2002లో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, కనీసం రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించకుండా చంద్రబాబు ప్రభుత్వం చిత్తూరు డెయిరీని మూసివేసిందన్నారు. కేవలం తన సొంత హెరిటేజ్ సంస్థ ప్రయోజనాల కోసమే చిత్తూరు డెయిరీని మూసివేశారన్నారు. సొంత లాభం కోసం చంద్రబాబు సొంత జిల్లా రైతులను బలిపెట్టారన్నారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు డెయిరీని పునరుద్ధరించడానికి భూమి పూజ చేశామన్నారు. అమూల్ సంస్థ అధ్వర్యంలో ఇది నడుస్తుందని చెప్పారు. రూ.385 కోట్ల పెట్టుబడితో నిర్మించే ఈ డెయిరీ ద్వారా ప్రత్యక్షంగా 5000 మందికి, పరోక్షంగా రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. లక్షలాది మంది పాడి రైతులకు గిట్టుబాటు ధర లభించడంతోపాటు ప్రతి ఆరు నెలలకు ఒకసారి బోనస్ వస్తుందన్నారు. దశలవారీగా ఈ డెయిరీ విస్తరించి రోజుకు 10 లక్షల లీటర్ల పాల సేకరణ జరిగేలా చర్యలు చేపట్టడంతో పాటు వివిధ రకాల పాల ఉత్పత్తులను సైతం ఇక్కడ తయారు చేసే అవకాశం ఉందన్నారు. పాడి రైతులను ఆదుకునేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 54 సహకార, ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడం లేదా విక్రయించడం చేసిందని జగన్ విమర్శించారు. ఆ సంస్థలను కూడా తన అనుయాయులకు కారు చౌకగా కట్టబెట్టిందన్నారు. ఇందుకోసం హైదరాబాద్ సచివాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. 2004లో తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యుంటే ఆర్టీసీ, ఆసుపత్రులు, పాఠశాలలను సైతం అమ్ముకునేవాడని విమర్శించారు. చిత్తూరు జిల్లా అభివృద్ధిపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో గతంలో తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్తూరు సమీపంలో సీఎంసీ ఆసుపత్రికి కొంత భూమి కేటాయించారని, దీనికి సైతం చంద్రబాబు అడ్డుపడ్డారన్నారు. ఆ భూమిని కొందరు ఆక్రమించుకున్నారన్నారు. ఆయన బిడ్డగా చిలపల్లి వద్ద సీఎంసీ ఆసుపత్రి విస్తరణ పనులకు శంకుస్థాపన చేయడం గర్వంగా ఉందన్నారు. తిరిగి అధికారంలోకి రావడానికి చంద్రబాబు గిమ్మికులు చేస్తున్నారని, దత్తపుత్రుడిని సైతం జనంలోకి వదులుతున్నారన్నారు. చంద్రబాబును వెన్నుపోటు వీరుడిగా, పవన్ కల్యాణ్‌ను ప్యాకేజీ శూరుడిగా సీఎం అభివర్ణించారు. విపక్షాలకు దోచుకోవడం, పంచుకోవడం, తినుకోవడం తప్ప ప్రజాసంక్షేమం పట్టదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేకపోయినా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, తెలుగుదేశం ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాలను నాడు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

ఇంగ్లీష్ బోధనను, ఇళ్ల స్థలాలను అడ్డుకుంటున్న ప్రతిపక్షాలను ప్రజలే నిలదీయాలన్నారు. పెత్తందారులకు, పేదవారికి మధ్య యుద్ధం కొనసాగుతున్నదన్నారు. చంద్రబాబు చెప్పే అబద్ధాలు నమ్మొద్దని, ప్రతి ఒక్కరి ఇంట్లో మంచి జరిగిందా లేదా అన్నది కొలమానంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గుడిపాల మండలం చీలపల్లి వద్ద వేలూరు సీఎంసీ ఆసుపత్రి విస్తరణ పనులకు ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వామపక్ష నేతల అరెస్టు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు వస్తున్న సందర్భంగా వామపక్ష నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. జిల్లా అభివృద్ధి కోసం చిత్తూరులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్దకు వచ్చిన సీపీఐ జిల్లా కార్యదర్శి యస్.నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజులను అదుపులోకి తీసుకున్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ముఖ్యమంత్రి వెళ్లిన తర్వాత నాయకులను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగరాజు, గంగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ప్రశ్నించే వారిని, ప్రజల పక్షాన పోరాటాలు చేసే ఆందోళనకారులను అరెస్ట్ చేస్తే ఉద్యమాలు ఆగవని హెచ్చరించారు. విజయ డెయిరిలో జరిగిన అవకతవకులపైనా, చిత్తూరు జిల్లా అభివృద్ధి కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు.

సేవలోనే అనంతశక్తి

పుట్టపర్తిలో గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

అమరావతి: భారతదేశం అన్ని రాంగాల్లో దూసుకుపోతోందని ప్రధాని మోదీ అన్నారు. ఆధ్యాత్మికంగానే కాకుండా టెక్నాలజీ, ఆర్థికపరంగానూ రాణిస్తోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తిలో ప్రశాంతి నిలయం వద్ద సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌ను ప్రధాని మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. పుట్టపర్తి సాయి బాబాకు ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్నారని, భాషా, సంస్కృతికి అతీతంగా ప్రశాంతి నిలయం (ప్రధాన ఆశ్రమం) వారందరినీ కలుపుతుందని మోదీ అన్నారు. ప్రధాని తెలుగులో మాట్లాడుతూ 'సేవ అనే రెండు అక్షరాల్లోనే అనంతమైన శక్తి ఇమిడి ఉంది' అని అన్నారు. నూతన కన్వెన్షన్ సెంటర్ సదస్సులు, సెమినార్లు, సాంస్కృత కార్యక్రమాలకు వేదికవుతుందని, అన్ని వర్గాల ప్రజల మధ్య అవగా హనకు మాధ్యమంగా మారుతుందని మోదీ ఆకాం క్షించారు. ధ్యాన మందిరాలు, ఆహ్లాదకర తోటలు, అన్ని వసతులతో ప్రశాంతమైన వాతావరణం ప్రశాంతి నిలయం ఉంది. భారత్ పురోగతి గురించి మాట్లాడుతూ పుట్టపర్తిని డిజిటల్ జిల్లాగా మార్చాలని ప్రధాని పిలుపునిచ్చారు. రియల్ టైమ్ ఆన్‌లైన్ లావాదేవీల్లో 40శాతం భారత్‌లో జరిగాయని, పుట్టపర్తి (శ్రీ సత్యసాయి) జిల్లాను డిజిటల్‌గా మార్చేయాలని సాయి భక్తులకు సూచించారు. కలిసి ప్రయత్నిస్తే సత్యసాయి తదుపరి జయంతి నాటికి జిల్లా డిజిటల్‌గా మారుతుందన్నారు. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకో-వ్యవస్థ భారత్‌లో ఉందని, డిజిటల్ టెకాలజీ, 5జీ టెక్నాలజీ రంగాల్లో పెద్ద ఆర్థిక వ్యవస్థలతో పోటీ పడుతోందని మోదీ చెప్పారు. ఆధ్యాత్మికంగానే కాకుండా ఆర్థికంగా, సాంకేతిక పరిజ్ఞానం పరంగానూ భారత్ పురోగతి సాధిస్తోందన్నారు.

షర్మిల సేవలు ఏపీకా...తెలంగాణకా?

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసినప్పటికీ అనుకున్నంత స్థాయిలో పార్టీకి గుర్తింపు రాలేదు. కనీసం కూడా పార్టీ బలపడలేదు. ఒంటరిగా ఎన్నికలకు వెళితే ఓట్ల చీలికతో మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వచ్చే అవకాశముందని భావించిన షర్మిల... కాంగ్రెస్ గూటికి చేరేందుకు సిద్ధమైనట్లు సమాచారం. కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం షర్మిల చేరికపై ఆచితూచి వ్యవహరిస్తోంది.

వైఎస్ వర్గ నేతల ఆహ్వానం

తెలంగాణలో నాటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్గం కాంగ్రెస్ నేతలు షర్మిలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తుండగా, ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వర్గం వ్యతిరేకిస్తోంది. తెలంగాణ కంటే ఆంధ్రలోనే షర్మిల సేవలు కాంగ్రెస్‌కు లాభం చేకూరుస్తాయనే సాకుతో ఆమె చేరికను అడ్డుకుంటున్నట్లు సమాచారం. టి.కాంగ్రెస్ సీనియర్ నేతలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భట్టి విక్రమార్క, జానారెడ్డి, వి.హనుమంతరావు తదితరులు షర్మిలకు మద్దతుగా ఉన్నారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన వర్గంతో కలిసి రాహుల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన కూడా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. గతంలో షర్మిల, పొంగులేటి సమావేశమై రాజకీయ అంశాలపై చర్చించిన విషయం విదితమే. పొంగులేటి చేరికతో షర్మిల కాంగ్రెస్‌లోకి రావడం ఖాయమనే ప్రచారం జరుగుతోంది. షర్మిల కాంగ్రెస్‌లోకి వెళ్తే ఆమె ఒక్కరికే టికెట్టు ఇస్తారా లేక ఆ పార్టీలోని ముఖ్యనేతలకు టికెట్లు ఇస్తారా అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. షర్మిల పార్టీలో ఆమె తప్ప మిగిలిన నేతలెవ్వరికీ ఎమ్మెల్యేలుగా గెలిచే సత్తా లేదు. షర్మిల కాంగ్రెస్‌లో చేరాలని ఏపీ కాంగ్రెస్ నేతలు ఆహ్వానిస్తున్నారు. షర్మిల వస్తే తమ పార్టీకి ఎంతోకొంత బలం ఉంటుందని తులసిరెడ్డి తదితరులు వ్యాఖ్యానిస్తున్నారు.

షర్మిల సేవలు ఏపీకా...తెలంగాణకా?

షర్మిల కాంగ్రెస్‌లో చేరితే ఆమె సేవలు తెలంగాణ రాష్ట్రానికి పరిమితం చేస్తారా లేక ఏపీకి పంపుతారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏపీ సీఎం జగన్ సోదరి అయిన షర్మిల ఏపీ రాజకీయాల్లోకి వస్తే వైసీపీకి నష్టమని ఆ పార్టీ శ్రేణులు వాపోతున్నారు. ఏపీకి రాకుండా ఆమెను తెలంగాణకే పరిమితం చేసేలా వైఎస్ విజయమ్మతోను, షర్మిలతోనూ వైసీపీ సీనియర్ నేతలు చర్చిస్తున్నట్లు సమాచారం. షర్మిల తన రాజకీయ భవిష్యత్తు కోసం ఎలాంటి నిర్ణయానికి వెనుకాడే ప్రసక్తి లేదని తెలుస్తోంది. తెలంగాణలో పార్టీ పెట్టవద్దని జగన్ సూచించినప్పటికీ ఆయన మాటను బేఖాతరు చేస్తూ షర్మిల పార్టీ పెట్టిన విషయం విదితమే. జులై 8న వైఎస్ జన్మదిన వేడుకల సందర్భంగా షర్మిల కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది.

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి

- సోము, బండి తొలగింపు
- ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా ఈటల... జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కిరణ్ కుమార్‌రెడ్డి

న్యూఢిల్లీ: బీజేపీ భారీ సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, జార్ఖండ్, పంజాబ్ రాష్ట్రాలకు పార్టీ నూతన అధ్యక్షులను మంగళవారం ప్రకటించింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చాలా రాష్ట్రాల్లో సంస్థాగతంగా కీలక మార్పులు చేసింది. పార్టీ ఆంధ్ర ప్రదేశ్ కొత్త అధ్యక్షురాలిగా పురందేశ్వరిని, తెలంగాణ రాష్ట్రానికి జి.కిషన్‌రెడ్డిని నియమిస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీలో సోము వీర్రాజు, తెలంగాణాలో బండి సంజయ్‌ను పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించింది. అలాగే తెలంగాణలో ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్‌ను నియమించింది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిని బీజేపీ జాతీయ కార్యవర్గ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేశారు. వీరితో పాటు జార్ఖండ్ బీజేపీ అధ్యక్షుడిగా మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ మరాండీ, పంజాబ్ నూతన అధ్యక్షుడిగా సునీల్ జాఖర్‌ను నియమించినట్లు ప్రకటనలో వెల్లడించారు. రాబోయే రోజుల్లో పునర్వ్యవస్థీకరణలో బండి సంజయ్ కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా చేరవచ్చని ఆ వర్గాలు తెలిపాయి. తెలంగాణాలో బండి సంజయ్‌కు వ్యతిరేకంగా చాలా మంది ఉన్నందున స్థానిక పార్టీని చక్కదిద్దేందుకు ఆయనను అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించింది. దీపక్ ప్రకాష్ స్థానంలో మరాండీ రాగా, అహ్వానీ శర్మ స్థానంలో జాఖర్ వచ్చారు.

ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన నేతలకు ప్రాధాన్యత ఇచ్చారు. జాఖర్, ఈటల రాజేందర్ వరుసగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను విడిచిపెట్టి బీజేపీలో చేరారు. పురందేశ్వరి కాంగ్రెస్‌లో, యూపీఏ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. ఈ పరిణామం కేబినెట్ పునర్వ్యవస్థీకరణ గురించి ఊహాగానాలకు మరింత ఊతమిస్తోంది.

ఘోర అవమానం

(మొదటిపేజీ తరువాయి)

జయంతి కార్యక్రమాన్ని సోము వీర్రాజు నిర్వహించిన కొద్దిసేపటికే ఆయన ఈ వార్త వినాల్సి వచ్చింది. ఆ తర్వాత కొత్త అధ్యక్షురాలిగా పురందేశ్వరిని నియమిస్తూ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం పురందేశ్వరి అమర్నాథ్ యాత్రలో ఉన్నారు.

పురందేశ్వరి ప్రహసనం ఇలా...

మాజీముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు మరణానంతరం ఆయన కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2004 ఎన్నికల్లో బాపట్ల పార్లమెంటు నియోజకవర్గం నుంచి, 2009లో విశాఖపట్నం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా గెలుపొందారు. యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఏపీ విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీ అనుసరించిన విధానాన్ని వ్యతిరేకిస్తూ 2014లో బీజేపీలో చేరారు. తొలుత మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన పురందేశ్వరి...తర్వాత పార్టీ ప్రధానకార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఒడిశా రాష్ట్ర ఇన్‌చార్జిగా ఉన్నారు.

స్థానికులకే కన్వీనర్ కోటా మెడికల్ సీట్లు

అదనంగా అందుబాటులోకి మరో 520

15శాతం ఆలిండియా కోటా యథావిథం

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ విద్యార్థులు స్థానికంగా ఉంటూనే డాక్టర్ కావాలనే కలను సాకారం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. 2014 జూన్ 2 తర్వాత రాష్ట్రంలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని కాంపిటేటివ్ అథారిటీ (కన్వీనర్) కోటాలోని 100శాతం సీట్లను స్థానికులకే కేటాయించాలని నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర వైద్య కళాశాలల్లో ప్రవేశాల నిబంధనలను సవరిస్తూ ఈ మేరకు ఉత్తర్వులను వైద్యారోగ్య శాఖ జారీ చేసింది. తాజా నిర్ణయంతో తెలంగాణ విద్యార్థులకు 520 మెడికల్ సీట్లు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. కొత్త కాలేజీలలో 15శాతం ఆలిండియా కోటా యధాతథంగా ఉండనున్నది. ఇందులో తెలంగాణ, ఏపీతోపాటు దేశంలో ఎక్కడి విద్యార్థులైనా మెరిట్ ప్రకారం ప్రవేశాలు పొందవచ్చు. తెలంగాణ ఏర్పాటుకు ముందు 20 వైద్య కాలేజీలు... 2,850 ఎంబీబీఎస్ సీట్లు ఉండేవి. ఈ సీట్లలో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 1,895 సీట్లు ఉండేవి. ఇందులో అన్ రిజర్వుడ్ కోటాగా 15శాతం అంటే.. 280 సీట్లు ఉండేవి. ప్రస్తుతం సీట్ల సంఖ్య 56కు పెరిగింది. అంటే స్వరాష్ట్రంలో 36 కొత్త కాలేజీలు వచ్చాయి. సీట్ల సంఖ్య 8,340కు పెరిగింది. పాత విధానమే కొనసాగితే, పెరిగిన మెడికల్ కాలేజీల్లో కూడా 15శాతం అన్ రిజర్వుడ్ కోటా అమలు చేయాలి. దీంతో మరిన్ని సీట్లు తెలంగాణ విద్యార్థులు కోల్పోవాల్సి వస్తుంది. కాబట్టి అన్ రిజర్వుడ్ కోటాను పాత 20 మెడికల్ కాలేజీలకు మాత్రమే పరిమితం చేస్తూ నిబంధనలకు ప్రభుత్వం సవరించింది. ఎంబీబీఎస్ 'బీ' కేటగిరి సీట్లలో 85శాతం తెలంగాణ విద్యార్థులకే చెందేలా లోకల్ రిజర్వ్ చేసుకున్న సంగతి తెలిసిందే. దాంతో తెలంగాణ విద్యార్థులకు అదనంగా 1300 ఎంబీబీఎస్ సీట్లు లభించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో కలిపి ఏటా తెలంగాణ విద్యార్థులకు మొత్తం 1820 సీట్లు దక్కనున్నాయి. కాలేజీలు పెరిగిన కొద్దీ ఈ సీట్ల సంఖ్య మరింత పెరగనున్నది.

ఎంబీబీఎస్ సీట్లలో 43 శాతం తెలంగాణకే: హరీశ్‌రావు



విశాలాంధ్ర-హైదరాబాద్: వైద్యరంగంలో తెలంగాణ మరో మైలురాయిని చేరుకుందని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. 2023-24 విద్యా సంవత్సరానికి గానూ దేశంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల పరిధి సీట్లలో 43 శాతం సీట్లు తెలంగాణ నుంచి అందుబాటులోకి వచ్చినవే అని హరీశ్‌రావు ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మెడికల్ కాలేజీలకు అనుమతలొస్తే సీట్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు ప్రస్తుతం ఉన్న మొత్తం 2,118 ఎంబీబీఎస్ సీట్లలో 900 సీట్లు రాష్ట్రానివేనని తెలిపారు. ప్రతి జిల్లాకొక వైద్య కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్యంతో పాటు వైద్య విద్యను ప్రజలకు మరింత చేరువ చేస్తామని వెల్లడించారు. ఆరోగ్య తెలంగాణ సాకారం చేయాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నారు. అదనంగా 1,820 మెడికల్ సీట్లు తెలంగాణ విద్యార్థులకు వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చేసిందని, దీన్ని సద్వినియోగం చేసుకొని డాక్టర్ కావాలనే కలను విద్యార్థులు సాకారం చేసుకోవాలని హరీశ్ రావు అన్నారు. ఒకవైపు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తూనే ఎకువ సీట్లు తెలంగాణ విద్యార్థులకు దకేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

అల్లూరి దేశభక్తి అసమానం

విశాలాంధ్ర-హైదరాబాద్: అల్లూరి సీతారామరాజు మన్యం వీరుడని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడారు. ఆయన దేశభక్తి అసమానమైందన్నారు. అల్లూరి పోరాటం ప్రజలకు స్ఫూర్తినిచ్చిందని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం జరిగిన అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకల ముగింపు కార్యక్రమంలో ముర్ము మాట్లాడుతూ మహనీయుల చరిత్రను భవిష్యత్ తరాలకు భద్రంగా అందించాలని పిలుపునిచ్చారు. అల్లూరి ఒక ప్రత్యేకమైన యుద్ధ నైపుణ్యంతో ఆంగ్లేయులపై పోరాటం చేశారని, నేతాజీ పోరాటం వలే అల్లూరి సీతారామరాజు పోరాటం కూడా ప్రజల్లో స్ఫూర్తి నింపిందని గుర్తుచేశారు. 98 ఏళ్ల క్రితం 27 ఏళ్ల వయసులో చనిపోయిన వ్యక్తి అల్లూరి. అలాంటి వ్యక్తిని ఇప్పటికీ సమాజం గుర్తుపెట్టుకుంది అంటే అదీ ఆయన గొప్పతనం అన్నారు. చిన్న వయసులోనే ప్రజల కోసం పోరాటం చేయాలనే ఆలోచన చేసిన వ్యక్తి అల్లూరి అనీ, దాదాపు 40 గ్రామాల్లో 300 మంది గిరిజన యోధులను తయారు చేసుకుని బ్రిటీష్ వారిపై పోరాడారన్నారు.

పోలీస్ స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలు సేకరించి యుద్ధం చేశాడనీ, గాంధీ అహింసతో స్వాతంత్ర్య ఉద్యమం చేస్తే...అల్లూరి, భగత్ సింగ్, నేతాజీ సాయుధ పోరాటం ద్వారా ఉద్యమం చేశారని చెప్పారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్న సమయంలో....బ్రిటన్‌కు భారతీయుడు ప్రధాని అయ్యారు. ఇదీ భారత దేశం గొప్పదనం మని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరంలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు 30 అడుగుల కాంస్య విగ్రహం, స్మృతి వనాన్ని హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా రాష్ట్రపతి ప్రారంభించారు.

ఇది ఆరంభమే

నిర్వాసితుల సమస్యలపై పోరాటం ఆగదు

- బీజేపీ విద్రోహంపై నిలదీయాలి
- 'పోలవరం నిర్వాసితుల పోరుకేక' పాదయాత్ర ముగింపు ధర్నాలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ: పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరు ఆగదని సీపీఎం స్పష్టంచేసింది. పాదయాత్ర ప్రారంభం మాత్రమేనని, ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాన్ని ఉధృతం చేసి బుద్ధి చెపుతామని హెచ్చరించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురైన నిర్వాసితుల ఆందోళనలకు పార్టీలు, సంఘాలు, పౌరసమాజం మద్దతు తెలపాలని పిలుపునిచ్చింది. బీజేపీ విద్రోహంపై నిలదీయాలని విజ్ఞప్తి చేసింది. ప్రాజెక్టు ఆలస్యానికి కారకులెవరో ప్రభుత్వాలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది. సీపీఎం చేపట్టిన 'పోలవరం నిర్వాసితుల పోరు కేక' పాదయాత్ర ముగింపు సందర్భంగా విజయవాడలోని ధర్నాచౌక్‌లో మంగళవారం మహాధర్నా జరిగింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అధ్యక్షత వహించారు. సభకు తొలుత అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరావు, వీర తెలంగాణ విప్లవ పోరాటంలో అశువులు బాసిన దొడ్డి కొమరయ్య చిత్రపటానికి బీవీ రాఘవులు పూలమాల వేసి నివాళులు అలర్పించారు.

కారణం ఎవరు: బీవీ రాఘవులు

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ జలయజ్ఞంలో భాగంగా పోలవరం ప్రారంభ సమయంలో ఐదేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేస్తామని అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి చెప్పారని, 30 ఏళ్లయినా ప్రాజెక్టు పూర్తి కాదని చెప్పామని గుర్తుచేశారు. ప్రాజెక్టుకు రూ.16 వేల కోట్లు కాదు...రూ.50 వేల కోట్లు కావాలని డిమాండ్ చేశామని, ఇప్పుడదే జరిగిందన్నారు. ప్రాజెక్టు ఆలస్యానికి కారకులెవరు... సర్వం త్యాగం చేసిన నిర్వాసితులా...జాతీయ ప్రాజెక్టు అన్న బీజేపీనా... బీజేపీ పంచన చేరి కాలక్షేపం చేసిన టీడీపీ కారణమా...బీజేపీ అడుగులకు మడుగులొత్తుతున్న వైసీపీనా... సమాధానం చెప్పాలని రాఘవులు డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దిగిరాకపోతే ప్రతి గ్రామాన్నీ రణక్షేత్రం చేస్తామని, పాలనను స్తంభింపజేస్తామని, సచివాలయాలను నడవనీయమని హెచ్చరించారు. మరో పది, పదిహేను రోజులు చూస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే విశాల మద్దతుతో ఐక్య పోరాటాన్ని ఉధృతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈసారి వరదొస్తే తాడేపల్లి ప్యాలెస్ ఎక్కాల్సి వస్తుందన్నారు.

రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల పోరాటం వెనుక ఈ రాష్ట్రం, కోట్లాది మంది ప్రజలు ఉన్నారన్నారు. మహాధర్నాకు ఆయన సంఘీభావం, పాదయాత్రికులకు అభినందనలు తెలియజేశారు. మీ ఆవేదనను, కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నామని, ఉత్తరాంధ్ర, రాయలసీమకు నీటిపారుదల సదుపాయం కల్పించాలంటే పోలవరం అవసరమన్నారు.

గిరిజనులు చేసిన నేరమేమిటి: రామకృష్ణ

గిరిజన ప్రజలు ఏమి నేరం చేశారని వరదల్లో ముంచారో చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. ప్రాజెక్టు కడితే ఎవరు మునిగిపోతారో తెలుసని, అయినా ఎందుకు పట్టించుకోవడం లేదో తెలపాలన్నారు. చిన్న చిన్న విమర్శలకే పెద్దఎత్తున స్పందించే వైసీపీ నాయకులు ఇంత పెద్దఎత్తున పాదయాత్ర చేస్తున్నా ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. పోలవరం ముంపుపై సీఎం జగన్ ఒక్క మాట మాట్లాడటం లేదని, అవినాశ్‌రెడ్డి కేసు కోసమే సీఎం జగన్ తరచూ ఢిల్లీ వెళుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీని ప్రసన్నం చేసుకోవడం తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం నిలదీసింది లేదు... నిగ్గదీసింది లేదని రామకృష్ణ అన్నారు. పోలవరం ప్రాజెక్టు దెబ్బతిందంటే దానికి వైసీపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో దోచుకుంటున్నారని ఆరోపించారు. నిర్వాసితులకు పక్కాగా అన్యాయం జరుగుతోందన్నారు.

ప్రజలను ముంచి... బంగారం పండిస్తారా: చలసాని

నిర్వాసితులను ముంచేసి ఆ నీటితో వ్యవసాయం చేసి బంగారం పండిస్తామంటే ఊరుకునేది లేదని, వారి జీవితాల్లో వెలుగులు ఆర్పేసి తయారు చేసే విద్యుత్‌తో మన ఇళ్లలో దీపాలు వెలిగించుకోవడం సరికాదని ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాసరావు అన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావిస్తామన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. ప్రాజెక్టు వ్యయం రూ.55 వేలకోట్లు అని అంచనా వేయగా, అందులో పునరావాసం కింద రూ.33 వేలకోట్లు అని పేర్కొన్నారు. అందులో ఇప్పటికి ఖర్చు చేసింది కేవలం రూ.7 వేలకోట్లు మాత్రమేనన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆవశ్యకత గురించి పౌర సమాజం తెలుసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి.వెంకటేశ్వర్లు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.మూర్తి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కె.పోలారి, ఎస్‌యూసీఐ (సి) కార్యదర్శి బీఎస్ అమర్‌నాథ్, నిర్వాసితుల నాయకులు రవి, గిరిజన మహిళా నాయకులు మడియం నాగమణి, అమరావతి రైతు జేఏసీ నాయకులు పువ్వాడ సుధాకర్ తదితరులు ప్రసంగించారు. తొలుత సీపీఎం నాయకులు సీహెచ్ బాబూరావు స్వాగతం పలికారు.

ఆకట్టుకున్న గిరిజన నృత్యాలు

గోదావరి జిల్లాల సంస్కృతి, సంప్రదాయాలను వివరిస్తూ గిరిజనులు చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాదయాత్రలో ముందు ఉండి ప్రజలను ఆకట్టుకున్నారు. పోలవరం పోరు కేక ఉదయం 9 గంటలకు కండ్రిక వద్ద నగరంలోకి ప్రవేశించింది. 10.30 గంటలకు ధర్నాచౌక్ వద్దకు చేరుకుంది. ధర్నాతో పోరుకేక పాదయాత్ర ముగిసింది.

వైసీపీ కేంద్ర కార్యాలయంలో అల్లూరి జయంతి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. పార్టీ రాష్ట్ర సమన్వయకర్త, జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి, నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, డొక్కా మాణిక్యవరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, వరుదు కల్యాణి తదితరులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు ప్రసంగించారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ వలస పాలకులకు వ్యతిరేకంగా, ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. ఆయన చేసిన పోరాటం చరిత్ర పుటల్లో, సువర్ణాక్షరాలతో లిఖించాలని తెలిపారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరిని తరతరాల వారు స్మరించుకునేలా, సీఎం వైఎస్ జగన్ ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టారని గుర్తు చేశారు. అల్లూరి స్ఫూర్తితో ఆదివాసీల హక్కులను కాపాడటంలో, వారికి అన్నిరకాలుగా అండదండలు అందించడంలో జగన్ ప్రభుత్వం ముందుందని తెలిపారు. గిరిజనులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామని, వారి ఆధీనంలోని పోడు భూముల వ్యవసాయాన్ని ఎవరూ ఆటంకపరచకుండా వ్యవసాయ పట్టాలు ఇచ్చామని వివరించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని స్పష్టం చేశారు. అల్లూరికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటు సభ్యులు నందిగం సురేష్, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్ కుమార్, పార్టీ ఎస్టీ విభాగం అధ్యక్షుడు హనుమంతు నాయక్ పాల్గొన్నారు.

బేవరేజస్ హమాలీల కూలిపెంపు

మే 1 నుంచి బకాయిల చెల్లింపునకు అంగీకారం

విశాలాంధ్ర-విజయవాడ: బేవరేజస్ హమాలీలకు కూలీ రేట్లు పెరిగాయి. బాక్సుకు 0.60 పైసలు పెంచటంపై బేవరేజస్ హమాలీ యూనియన్లు హర్షం వ్యక్తంచేశాయి. ఏఐటీయూసీ పోరాటం ఫలితంగా ఏపీఎస్ బీసీఎల్ డిపోలలో పనిచేస్తున్న 2,600 మంది హమాలీలకు దిగుమతి కూలీ రెట్లు ఒక బాక్సుకు 0.60 పైసలు పెంచుతూ, మే 1 తేదీ నుంచి ఎరియర్స్ చెల్లించే విధంగా ఏపీ బీసీడీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డి. వాసుదేవరెడ్డి సమక్షంలో ఏపీఎస్ బీసీఎల్, ఐఎంఎఫ్ఎల్ డిపోల హమాలీ యూనియన్ల మధ్య మంగళవారం అంగీకారం జరిగింది. గత కూలీ రేట్ల ఒప్పందం మార్చి 31న ముగియగా గడిచిన రెండు నెలల కాలంగా రెండు దఫాలు యాజమాన్యం, హమాలీ సంఘాల మధ్య చర్చలు జరిగాయి. మధ్యలో యాజమాన్యం 60పైసల కంటే ఎక్కువ పెంచలేమని మొండిగా వ్యవహరించింది. దానితో కార్పొరేషన్ అధికారులు కలుగచేసుకోని వివాదం సర్దుబాటు చేశారు. మొదటిసారిగా హమాలీలకు ఎరియర్స్ చెల్లించే విధంగా యాజమాన్యాన్ని ఒప్పిస్తామని హామీఇచ్చారు. మంగళవారం ఎండీ సుహృద్భావ వాతవరణంలో చర్చలు నిర్వహించి వివాదాన్ని పరిష్కరించారు. ఈ ఒప్పందం జరగడానికి సహకరించినందుకు ఎండీకి, అధికారులకు ఏపీ ఎస్‌బీసీఎల్ ఐఎంఎఫ్ఎల్ డిపో హమాలీ యూనియన్ ధన్యవాదాలు తెలిపింది. మొదటి నుంచి ఎరియర్స్ కోసం ఏఐటీయూసీ పట్టు పట్టింది. 60 పైసలు రేటుని, ఎరియర్స్ సాధించడంలో ఏఐటీయూసీ అనుబంధ హమాలీ యూనియన్ కీలక పాత్ర పోషించింది. ఎండీ సమక్షంలో జరిగిన చర్చల్లో ఏఐటీయూసీ అనుబంధ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటసుబ్బయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.లోకేశ్, రాష్ట్ర నాయుకులు హర్షవర్ధన్ , గుడివాడ శ్రీను, మార్కాపురం మేస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ఏపీపీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఇటీవల జారీచేసిన వివిధ విభాగాల ఉద్యోగాలకు ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షల షెడ్యూలును ప్రకటించారు. ఈ మేరకు ఏపీపీఎస్సీ సెక్రటరీ జె.ప్రదీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీపీఎస్సీ ప్రకటించిన నాన్-గెజిటెడ్ పోస్టులు ఏపీ ప్రివెంటివ్ మెడిసిన్, పబ్లిక్ హెల్త్ ల్యాబ్స్ అండ్ ఫుడ్, ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ సబార్డినేట్ సర్వీస్‌లో కంప్యూటర్ డ్రాఫ్ట్స్‌మేన్ పోస్టులకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి రోజూ రెండు విడతలుగా ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్షల పూర్తి వివరాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

బీఎస్సీ సీబీజెడ్ గ్రూపును అందుబాటులోకి తేవాలి

విద్యాశాఖ మంత్రికి సాయికుమార్ వినతి



విశాలాంధ్ర- విజయవాడ: అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం మండలంలో అల్లూరి సీతారామ రాజు డిగ్రీ కళాశాలలో బీఎస్సీ సీబీజెడ్ గ్రూప్‌ను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాలని కోరుతూ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ బృందం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చుట్టుపక్కల 10 మండలాల నుంచి విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్నారని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల డిగ్రీ విద్యను ప్రవేశపెట్టిన నేప థ్యంలో అక్కడ కేవలం బీఏ (పొలిటికల్ సైన్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ) గ్రూప్‌లు మాత్రమే విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బైపీసీ చదివిన విద్యార్థులు కళాశాలలో చేరడానికి అక్కడ బీఎస్సీ సీబీజెడ్ గ్రూప్ లేకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యా ర్థులు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే బీఎస్సీ సీబీజెడ్ గ్రూప్‌ను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

యువత పెద్దలను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: యువతీ యువకులంతా పెద్దలను ఆదర్శంగా తీసుకోవాలని, అప్పుడే మన లక్ష్యాన్ని సాధించగలమని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు సూచించారు. విజయవాడ ఆంధ్రరత్న భవనంలో జరిగిన వివిధ ప్రముఖుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, వంగవీటి మోహన్ రంగా జయంతితోపాటు జాతీయ జెండా సృష్టికర్త పింగళి వెంకయ్య వర్ధంతి పురస్కరించుకున వారి చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు కేవీపీ రామచంద్రరావు, జేడీ శీలం, జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ, నరహరిశెట్టి నరసింహారావు, వి.గురునాథం, వినయ్ కుమార్, మీసాల రాజేశ్వరరావు, పీవీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సంక్షేమ చట్టాలు అమలు చేయాలి

ఐఏఎల్ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్ కుమార్

విశాలాంధ్ర-విజయవాడ: దేశవ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న న్యాయవాదుల సమస్యలపై ప్రభుత్వాలు స్పందించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి సీనియర్ న్యాయవాది చలసాని అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఉన్న చట్టాలు సక్రమంగా అమలు చేయడం లేదని, సరైన రక్షణ కరువైందని తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం నగరంలో న్యాయవాదులు కొద్దిసేపు తమ విధులను బహిష్కరించి సివిల్ కోర్టుల సముదాయం ఎదుట నిరసన ధర్నా చేపట్టారు. ప్ల కార్డులతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చలసాని అజయ్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమ నిధి కింద ఇవ్వాల్సిన రూ.75 కోట్ల బకాయిలు విడుదల చేయాలని, సంక్షేమ నిధిని రూ.10 లక్షలకు పెంచాలని, మరణించిన వారి కుటుంబాలకు చెల్లించవలసిన పెండింగ్ మ్యాచింగ్ గ్రాంట్ రూ.30 కోట్ల బకాయిలు విడుదల చేయాలని, న్యాయవాదులకు తక్కువ ధరకే ఇళ్ల స్థలం ఇవ్వాలని, ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డు అమలు చేయాలని, యువ న్యాయవాదులను గుర్తించి లా నేస్తం నిధులు ప్రతి నెలా అందించాలని డిమాండ్ చేశారు. నగరంలో ఆధునిక భవనాలయితే పూర్తి చేశారుగానీ, అందులో మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో హక్కుల నేత, సీనియర్ న్యాయవాది జయగోపాల్‌పై ఉన్మాదుల దాడి అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.బి.సుందర్, ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి.వి.పరమేశ్వరరావు, కె.సుధాకర్‌రాజు, కార్యదర్శి ఎం.ఎ.షరీఫ్, కోశాధికారి బోను జయమ్మ, ప్రతినిధులు ఈఎస్ ప్రసాద్, బి.రత్నాకర్ రెడ్డి, జి.వి.రాజు, ఎన్.సాయి శంకర్, కందుల శ్రీనివాస్, గొరిపర్తి శ్రీనివాస్, ఆర్.గంగాభవాని, ఏఎస్ఎన్ రాంప్రసాద్, పిచ్చుక శ్రీనివాస్, కె.ఎస్.బోస్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పీఎం కిసాన్ బీమా

కాటమయ్య డిమాండ్

విశాలాంధ్ర-డోన్: కౌలు రైతులకు కూడా ప్రధానమంత్రి కిసాన్ బీమా వర్తింప చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా కౌలు రైతుల సదస్సు డోన్ పట్టణంలోని వ్యవ సాయ మార్కెట్ యార్డులో రైతు సంఘం జిల్లా నాయకుడు జి.సోమన్న అధ్యక్షతన మంగళవారం జరిగింది. కాటమయ్యతోపాటు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 26 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారన్నారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. జిల్లాలో కౌలు రైతుల జాబితా తయారుచేసి... గుర్తింపు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా పంట నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు ఈ-క్రాప్ నమోదు కావడం లేదన్నారు. నంద్యాల జిల్లాలో అరటి, మిరప, పత్తి, శనగ, ఉల్లి పంటలు ఎక్కువ పండి స్తారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే కౌలు రైతు సంఘాల అధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్య మాలు చేపడతామని హెచ్చరిం చారు. అనంతరం కౌలు రైతు సంఘం నంద్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.రామ కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పి.నరసింహులు, అధ్యక్షుడితో పాటు ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కన్వీనర్ వి.నారాయణ, సీపీఐ డోన్ మండల కార్యదర్శి పులి శేఖర్, పట్టణ కార్యదర్శి బి.నారాయణ, రైతుసంఘం డోన్ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

విద్య కాషాయీకరణ, కార్పొరేటీకరణపై పోరు

- నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి
- డిగ్రీ విద్యా విధానాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-మంత్రాలయం: విద్య కాషాయీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరు సాగిద్దామని ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని, డిగ్రీ విద్యా విధానాన్ని పాతపద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల విద్యావైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులు మంగళవారం మంత్రాలయంలో ఏఐఎస్ఎఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షులు సోమన్న అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని జాతీయ కార్యదర్శి జి.రంగన్న ఆవిష్కరించారు. శిక్షణా తరగతులకు ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి జి.రంగన్న మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యను పూర్తిగా కాషాయీకరణ, కార్పొరేటీకరణ చేస్తోందని మండిపడ్డారు. పాఠ్యాంశాల్లో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి చరిత్రను తొలగించి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుల చరిత్రను చేర్చి విద్యార్థుల మెదడుల్లో మతతత్వాన్ని నింపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడాన్ని ఖండించారు. మోదీ తాము అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానంటూ విద్యార్థులను, యువకులను నమ్మబలికి అధికారంలోకి వచ్చే ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగాలు ఇచ్చింది లేదని విమర్శించారు. ఉన్న పరిశ్రమలను కార్పొరేట్‌లు అంబానీ, అదానీకి అప్పగిస్తోందని మండిపడ్డారు. డిగ్రీ విద్యా విధానాన్ని ప్రస్తుతం ఉన్న మూడు సంవత్సరాలను రద్దు చేసి నాలుగు సంవత్సరాలు కొనసాగిస్తామని బీజేపీ ప్రభుత్వం ప్రకటించడాన్ని తప్పుపట్టారు. డిగ్రీ విద్యా విధానాన్ని పాత పద్ధతుల్లోనే మూడు సంవత్సరాలుగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థను పూర్తిగా అయోమయ స్థితిలోకి తీసుకువచ్చారన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అన్న జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు జీవో నంబర్ 77 తీసుకువచ్చి వారిని చదువుకు దూరం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. తక్షణమే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జగనన్న విద్యా కానుక పేరుతో విద్యార్థులకు ఇస్తున్న కిట్లలో నాణ్యత లోపించిందని తక్షణమే వాటిని మార్పు చేసి నాణ్యంగా ఉన్న కిట్లు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు సరైన వసతులు లేక ఇబ్బం దులు పడుతున్నారని తెలిపారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెంది వాళ్లు ఇస్తున్న మామూళ్ల ముత్తులో మునిగి తేలుతున్నారన్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై మంత్రాలయంలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ విద్యా, వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులలో చర్చించి రాష్ట్రంలో ఉద్యమ కార్యాచరణకు రూపకల్పన చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరాములు, అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయి స్వామి, చిరంజీవి, నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, ధనుంజయ, సత్యసాయి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, కర్నూలు జిల్లా ఆఫీస్ బేరర్లు విజయేంద్ర, షాబీర్ బాషా, రంగస్వామి, శరత్, థామస్, అల్తాఫ్, నాలుగు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన మాట సంగతేంటి?

జగన్‌ను ప్రశ్నించిన కామేశ్వరరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: రాష్ట్రంలోని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి డబ్బులు చెల్లించకపోతే 40 లక్షల ఓట్లు గల్లంతు ఖాయమని అగ్రిగోల్డ్ ఏజెంట్స్, కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉత్తరాంధ్ర జిల్లాల గౌరవాధ్యక్షుడు పి.కామేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం అమర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పి.కామేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వి.నాయుడు, జిల్లా అధ్యక్షుడు మజ్జి సూరప్పడు కలిసి మాట్లాడారు. అగ్రిగోల్డ్ సంస్థ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నామని, అనేక లాభదాయక వ్యాపారాలు చేస్తున్నా మని, అగ్రిగోల్డ్ కుటుంబ సభ్యులందరి ఆర్థిక ఉన్నతికి కృషి చేస్తున్నామని నమ్మబలికి వేల కోట్ల రూపాయలకు ముంచిం దని విమర్శించారు. రాష్ట్రంలో వందలమంది ఏజెంట్లు, కస్టమర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం ప్రజల సొమ్ముతో కుటుంబ సభ్యులు, బంధువుల పేరున ఆస్తులు కూడబెట్టిందని తెలిపారు. అనేక బినామీ ఆస్తులను ఇంకా సీఐడీ అటాచ్‌మెంట్‌లు కూడా చేయకపోవడం దుర్మార్గం అన్నారు. డైరెక్టర్లు కొన్ని ఆస్తులను అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. అగ్రిగోల్డ్ ఏజెంట్స్, కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నేతృత్వంలో గత 9 సంవత్సరాలుగా నిరంతరాయంగా సాగించిన పోరాటాల ఫలితంగా రూ.906 కోట్లను రూ.10, 20 వేల లోపు ఉన్న పేద డిపాజిట్ దారులకు ఇప్పించగలిగామన్నారు. ఇంకా రూ.20 వేల లోపు డిపాజిట్ చేసిన 32 లక్షల మందికి, రూ.20 వేల పైన డిపాజిట్ చేసిన 62 లక్షల మందికి సుమారు 30.80 కోట్ల మేరకు రావలసి ఉందని వారు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో రూ.1,183 కోట్లు కేటాయించి 14 లక్షల చిన్న డిపాజిట్ దారులకు డబ్బు చెల్లిస్తానని, 6 మాసాలలో మొత్తం డిపాజిట్ దారులకు డబ్బు చెల్లించే బాధ్యత నాదంటూ, కోర్టు సంగతి... కంపెనీ సంగతి నేను చూసుకుంటానని గత ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చి విస్మరించారని మండి పడ్డారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నర ఏళ్లు పూర్తయినా ఇంకా 6 మాసాలు పూర్తికాలేదేమో అన్నట్లు ముఖ్యమంత్రి వ్యవహరించటం చాలా దారుణమని అన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న, మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు ఇస్తానని అగ్రిగోల్డ్ బాధితుల సభకు వచ్చి ప్రకటించిన ముఖ్యమంత్రి ఆ మాట మర్చిపోయినట్లు ఉన్నారని విమర్శించారు. పిల్లల పెళ్లిళ్లు, చదువులు ఆగిపోయాయని, ఆరోగ్య సమస్యలతో ప్రాణాలు కోల్పోతున్న పెద్దల ఆర్థిక స్థితి దారుణంగా మారిందని తెలిపారు. 2015లో రూ.20 వేల కోట్ల పైన ఆస్తులు ఉన్నాయని కంపెనీ చైర్మన్ ప్రకటించగా, నేడు తమ ఆస్తుల విలువ రూ.40 వేల కోట్లకు పెరిగిందని ఇటీవల కంపెనీ డైరెక్టర్లు ప్రకటించుకున్నారని అన్నారు. ప్రభుత్వం చేతిలో కంపెనీ ఆస్తులు ఉండగా, డిపాజిట్ దారులకు, ఏజెంట్లకు డబ్బు చెల్లించటంలో కాలయాపన చేయటం, ముఖ్యమంత్రి మాట నమ్మిన బాధితులను మరోసారి మోసగించటమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పదవి కోసం డిపాజిటర్ల ఓట్లు కొల్లగొట్టి ముఖ్యమంత్రి పదవి వచ్చాక కంపెనీకి వత్తాసుగా సీఎం జగన్ వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ నెలాఖరులోపు బాధితులకు పూర్తి న్యాయం చేకూర్చాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో సుమారు 40 లక్షల ఓట్లు కలిగిన అగ్రిగోల్డ్ ఏజెంట్స్, కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బాధితులు తమ ఆందోళనలను ఉధృతం చేసి డిపాజిట్ల సొమ్ము సాధించుకునేందుకు ఇదే సరైన సమయం అని గుర్తు చేస్తున్నామని అన్నారు. భవిష్యత్ పోరాటాల్లో ప్రతి ఒక్క బాధితుడు భాగస్వామ్యం కావలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, విజయనగరం బ్రాంచ్ గౌరవాధ్యక్షుడు బుగత అశోక్, ఎం.శ్రీను, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అంతులేని మోదీ కక్ష

మహారాష్ట్ర నాటకంలో ప్రధాన అంకం ముగిసిన తరవాత బీజేపీ కేంద్ర నాయకత్వం దృష్టి ఇప్పుడు బిహార్ మీదకు మళ్లింది. సరికొత్తగా ఆడుతున్న ఈ నాటకంలో లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబ సభ్యుల మీద చార్జ్ షీట్లు దాఖలు చేస్తున్నారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మళ్లీ బీజేపీతో చేయి కలుపుతారన్న ప్రచారం కొనసాగిస్తున్నారు. ఈ ప్రచార బాధ్యతను బీజేపీ నాయకత్వం సుశీల్ మోదీకి అప్పగించింది. నితీశ్ కుమార్ బీజేపీతో తెగతెంపులు చేసుకుని లాలూ ప్రసాద్ యాదవ్ నాయకత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్ తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరవాత కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టి అంతా బిహార్ మీదే ఉంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మీద ఆయన బిహార్‌లో పర్యటించినప్పుడల్లా విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. నితీశ్ మళ్లీ తమ సరసన చేరతారన్న ఆశ మోదీకి, అమిత్ షాకు ఇప్పటికీ ఉంది. అందుకే రకరకాల పద్ధతుల్లో ఆయన మీద ఒత్తిడి పెంచుతున్నారు. మహారాష్ట్రలో ఏడాది కింద శివసేనను, సోమవారం శరద్ పవార్ నాయకత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి.)ని చీల్చిన తరవాత ఇప్పుడు నితీశ్ కుమార్ నేతృత్వంలోని జె.డి.(యు)ను చీల్చే మార్గాలు ఆలోచిస్తున్నారు. ఆ పార్టీలలోని శాసనసభ్యులను నయాన్నో, భయాన్నో తమ వేపు తిప్పుకోవడానికి సకలవిధ ప్రయత్నాలూ చేస్తున్నారు. ఇలాంటి ప్రయత్నాలను "ఆపరేషన్ లోటస్" అంటున్నారు. అయితే రాజకీయంగా సతతం జాగరూకంగా ఉండే నితీశ్ కుమార్, బీజేపీ తన పార్టీని చీల్చే ప్రయత్నం చేస్తోందని గ్రహించి తన అనుయాయులు జారిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్.సి.పి. మీద, నితీశ్ నాయకత్వంలోని జె.డి.(యు) మీద మోదీ, అమిత్ షా కత్తిగట్టినట్టు ప్రవర్తిస్తున్నారు. అలాగే ఆర్.జె.డి. అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌ను, ఆయన కుమారుడు, ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌ను కూడా వేధించడానికి ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. ప్రత్యర్థులను రుజు మార్గంలో ఎదుర్కోవడం మోదీకి అలవాటే లేదు. లాలూ కుటుంబాన్నంతటినీ ఉద్యోగాల పేర భూములు కబళించారన్న ఆరోపణలతో నిరాధారమైనకేసులు నమోదు చేయిస్తున్నారు. ఎలాగైనా లాలూను, తేజస్వినిని జైలుకు పంపాలని ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. దిక్కుతోచని స్థితిలో పడి ప్రత్యర్థులను ఇరకాటంలో పెట్టడం విజ్ఞత ఉన్న రాజకీయ నాయకులు చేసే పనికాదు. ఆ విజ్ఞత కొరవడినందువల్లే మోదీ పదే పదే ఆ తప్పు దారిలోనే నడుస్తున్నారు. ఇది తన బలం అన్న భ్రమలో ఉన్నారు. ఏదో ఒక రకంగా ఉన్న, లేని ఆరోపణలు మోపి ప్రత్యర్థి పక్షానికి చెందిన నాయకులను అపఖ్యాతి పాలుచేసి జనాన్ని ఆ పార్టీకి దూరం చేయాలన్నది మోదీ ఎత్తుగడ. జనాదరణ ఉన్న పార్టీలను లొంగ దీయడానికి అనుసరించవలసిన పద్ధతి ఇది కాదు అని మోదీ గ్రహించడం లేదు. ఈ క్రమంలో ఆయన పలుకుబడికే విఘాతం కలుగుతోంది. ఈ ఎత్తుగడలలోని పన్నాగాలను గ్రహించే ప్రజలు కడకు బీజేపీనే ఏవగించుకునే పరిస్థితి కొని తెచ్చుకుంటున్నారు.

మోదీ నడవడిక సంఘ్ పరివార్‌కు సైతం నచ్చడం లేదు. గత మేలోనే ఆర్.ఎస్.ఎస్. అధికార పత్రిక "ఆర్గనైజర్" మోదీ వైఫల్యాలను ఎండగడ్తూ సంపాదకీయమే రాసింది. ఆయన పలుకుబడి తగ్గుతున్నందుకు ఆందోళన వ్యక్తం చేసింది. 2024 తరవాత అంతా సక్రమంగా ఉండి బీజేపీ విజయం సాధిస్తే మోదీని మళ్లీ ప్రధానమంత్రిని చేయగూడదన్న ఆలోచనలు కూడా సంఘ్ పరివార్ పెద్దల్లో సాగుతున్నాయన్న వదంతులున్నాయి. అయితే మోదీ పలుకుబడి తగ్గడానికి కారణం ఏమిటో మాత్రం ఆర్గనైజర్ పత్రిక సంపాదకీయంలో వెల్లడించలేదు. మోదీ పలుకుబడి తగ్గడానికి కారణం ఏమిటో సంఘ్ పరివార్‌కు తెలియదనుకోలేం. సంఘ్ పరివార్ ఎజెండాను అమలు చేయడానికి మోదీ అత్యుత్సాహం ప్రదర్శించారు. విద్వేష రాజకీయాలను తారస్థాయికి తీసుకెళ్లారు. మోదీ అనుసరిస్తున్న ముస్లిం వ్యతిరేక రాజకీయాలు మోదీ పలుకుబడిని బాగా దెబ్బతీశాయి. ఒక రకంగా ఆర్.ఎస్.ఎస్. నాయకత్వానికి కూడా అందనంత దూరం మోదీ వెళ్లిపోయారు. నిఖార్సైన నియంతలా వ్యవహరించే వారి చుట్టూ భక్తులే ఉంటారు తప్ప నిష్ఠుర సత్యం చెప్పడానికి సాహసించేవారు ఎవరూ ఉండరు. అందుకే నియంతలకు క్రమంగా ప్రజలతో సంబంధాలు లేకుండా పోతాయి. చప్పట్లు కొట్టే జనం మాత్రమే కనిపిస్తారు. ఈ వాతావరణం నియంతలను మరింత కరుడుగట్టేలా తయారు చేస్తుంది. మోదీ ప్రస్తుతం ఈ దశలోనే ఉన్నారు. అందుకే కసి తీర్చుకునే క్రమంలో ఎటు వెళ్తున్నామో కూడా గమనించే స్థితిలో లేరు. స్థిరాస్తులిస్తే ఉద్యోగాలు అన్న కుంభకోణంలో సీబీఐ సోమవారం చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఇది తేజస్వీ మీద రెండో చార్జ్ షీట్. లాలూ మీద, మరో ముగ్గురి మీద కొత్త చార్జ్ షీట్లు దాఖలయ్యే అవకాశం ఉంది. లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రాబ్డీ దేవి, కూతురు మీసా భారతి మీద ఇదివరకే చార్జ్ షీట్లు దాఖలు చేశారు. ఆ కేసులో వారికి న్యాయస్థానం బెయిలు మంజూరు చేసింది. మొట్ట మొదటి చార్జ్‌షీట్లో తేజస్వీ యాదవ్ పేరు లేదు. నిజానికి కుంభకోణం జరిగిందంటున్న సమయంలో తేజస్వీ బడికెళ్లే కుర్రాడు. ఇప్పుడు ఆయన ప్రభావవంతమైన రాజకీయ నాయకుడై పోయారు కనక పనిలో పనిగా రెండవ చార్జ్ షీట్లో ఆయన పేరు చేర్చేశారు. ఇవన్నీ మోదీ, అమిత్ షాకు తెలియకుండా జరుగుతున్నాయనుకోవడానికి వీల్లేదు. ఈ ఏడాది మార్చిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ దిల్లీలోని తేజస్వీ ఇంట్లో సోదా చేసింది.

బిహార్‌తో పాటు అనేక నగరాల్లో తేజస్వీకి సంబంధం ఉన్న చోట్లపై దాడులు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్, సీబీఐ తేజస్వీ మీద మోపిన కొన్ని ఆరోపణలు గురి తప్పాయి. గుర్గావ్‌లో ఒక హోటల్లో తేజస్వీకి వాటా ఉందన్నారు. తీరా చూస్తే ఆ హోటల్ హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సన్నిహిత అనుచరుడిదని తేలింది. ప్రత్యర్థులను అపఖ్యాతి పాలుచేసి, తాము కడిగిన ముత్యంలాంటి వాళ్లమని నిరూపించుకోవడానికి చేసే హడావుడిలో ఆరోపణలు గుప్పిస్తే ఇలాంటి ఘోరాలే జరుగుతాయి. తొక్కిన అడుసు కడుక్కోవడం కష్టం అవుతుంది. 2024లో ఓటమి తప్పదన్న భయం మోదీ, అమిత్ షాను విపరీతంగా పీడిస్తోంది. అందుకని వెనకా ముందు చూసుకోకుండా అవినీతి ఆరోపణలు మోపుతున్నారు. చివరకు తామే బోర్లా పడుతున్నారు. ఎన్నికల్లో విజయం సాధించడానికి సరైన దారి అన్వేషించకుండా అడ్డదార్లు తొక్కితే ఇలాంటి భంగపాటే ఎదురవుతుంది. కానీ తార్కికంగా ఆలోచించే అలవాటు మోదీకి లేదు.

యూపీ బీజేపీలో ఆందోళన

ఉత్తరప్రదేశ్‌లో క్షేత్రస్థాయి అంతర్గత నివేదిక బీజేపీని ఆందోళన పరుస్తోంది. రాష్ట్రంలోనే భిన్న ప్రాంతాల్లో ఆ పార్టీ పరిస్థితిపైన పార్టీ విశ్లేషకులు నివేదికలు అందచేశారు. వీటిపై ఆందోళన చెందిన నాయకత్వం ప్రతి నియోజకవర్గంలో ఎంపీ కార్యకలాపాలను, ప్రజలలో వారికిగల ఆదరణపైన నివేదికలు పంపాలని కేంద్ర నాయకత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని మొత్తం 80 సీట్లలో గెలవాలని బీజేపీ ఆశిస్తున్నది. దిగువస్థాయిలో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నందున రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలను కలుపుకుని ఎన్‌డీఏ ఉనికిని కాపాడుకోవడం ద్వారా ఎక్కువ సీట్లు గెలవవచ్చునని బీజేపీ భావిస్తోంది. 2014లో బీజేపీ 71సీట్లలో గెలిచింది. అప్నా దళ్(సునేలాల్), ఏడీ(ఎస్), పార్టీలు రెండు సీట్లు గెలవడంతో ఎన్‌డీఏ బలం 73కు పెరిగింది. 2019లో పుల్వామా దాడిపై తమ గొప్పతనాన్ని చాటుకుంటూ ప్రచారం చేసినప్పటికీ బీజేపీ 14 సీట్లలో ఓడిపోయింది. ఇప్పటి పరిస్థితిని అంచనావేయగా, బీజేపీ మరింత దిగజారినట్లు తెలుస్తోంది. 2019లో 62 సీట్లలోనే గెలుపొందింది. ఏడీ(ఎస్) రెండు స్థానాల్లో గెలవగా ఎన్‌డీఏ బలం 64 అయింది. 2014 నుంచి బీజేపీ బలం క్రమక్రమంగా తగ్గుతోంది. 2024లో జరగనున్న లోకసభ ఎన్నికల్లో సైతం బీజేపీని ఆందోళనపరచే పరిస్థితే నెలకొంది. ఈ సారి బీజేపీ కేవలం కులం, మతం ఆధారంగా హిందువుల ఓట్లను మాత్రమే రాబట్టుకునేట్లయితే అది ఎక్కువ సీట్లు ఆశించడం కష్టం. 2019నాటి నుంచి ఓబీసీలు అఖిలేష్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్‌వాదివైపు ఆకర్షితులయ్యారు.

2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సమాజ్‌వాది పార్టీ 111సీట్లు గెలుపొందింది. అంటే ఓబీసీలు సమాజ్‌వాది పార్టీని బలపరచినట్లుగా స్పష్టమైంది. ఆ పార్టీ 2017లో 47 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఇటీవల ప్రతిపక్షాల బలం పెరుగుదల, సమాజంలో పరిణామాలు సమాజ్‌వాది పార్టీ, దాని మిత్రపార్టీలు మరింత బలం పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలో యూపీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్రంలో ఎన్‌డీఏను పటిష్టం చేసుకోవాలని కృషి చేస్తున్నాడు. ఓబీసీల నాయకుడు కీ.శే. సునేలాల్ పటేల్ జన్మదినోత్సవం సందర్భంగా జరిగిన సభలో కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి అనుప్రియా పటేల్ మాట్లాడుతూ, రాష్ట్రంలో విచ్ఛిన్నకర శక్తులను పూర్తిగా తుడిచివేస్తామని అన్నారు. సొనేలాల్ పార్టీ అప్నాదళ్‌తో బీజేపీ తర్వాత సమాజ్‌వాది పార్టీ, బహుజన సమాజ్ పార్టీలు పొత్తుపెట్టుకున్నాయి. రాష్ట్రంలో ఎక్కువగా సమాజ్‌వాదీనే ఓబీసీల ఓట్లను ఎక్కువగా పొందగలిగింది. అలాగే దళితుల ఓట్లను బీఎస్‌పీ ఎక్కువగా ఆకర్షించింది. అప్నాదళ్(ఎస్) ఓబీసీల ఓట్లను గణనీయంగా పొందినప్పటికీ అది పరిమిత ప్రాంతాలలోనే ఆదరణ కలిగి ఉంది. ఈసారి ఆ పార్టీని దగ్గరకు చేర్చుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. అప్నాదళ్‌కు 2019లో 1.21శాతం ఓట్లు మాత్రమే లభించాయి. ఈసారి సమాజ్‌వాది పార్టీ కాంగ్రెస్‌తోనూ ఇతర చిన్న పార్టీలతోనూ పొత్తుపెట్టుకోవచ్చునని భావిస్తున్నారు.

ప్రతిపక్షాల పట్నా సమావేశానికి అఖిలేష్‌యాదవ్ కూడా హాజరయ్యారు. ఆర్‌ఎల్‌డీకి లభించిన 1.6శాతం ఓట్లు కూడా ప్రతిపక్షాలతో ఏర్పడనున్న ఫ్రంట్‌కే దక్కవచ్చు. 2014లో బీజేపీ ఓట్లశాతం 42.63శాతం కాగా, 2019లో 48.98శాతం ఓట్లు పొందింది. అయితే ఆ తర్వాత కాలంలో చాలా నియోజకవర్గాల్లో ఆ పార్టీకి ఓట్ల శాతం తగ్గడంతో 14సీట్లలో ఓడిపోయింది. ఈసారి బీజేపీ గతంలో తెచ్చుకున్నన్ని ఓట్లు పొందలేదని అంచనాఉంది. ఇప్పటి పరిస్థితుల్లో అప్నాదళ్ ఎదుగుదల దాదాపు ఆగిపోయింది. లోకసభ ఎన్నికలలో దాని ఓట్ల శాతం గణనీయంగా తగ్గి అది బలహీన పడుతుందని అందువల్ల ఓబీసీ ఓట్లు ఎక్కువగా బీజేపీకి రాకపోవచ్చునని భావిస్తున్నారు.

ఇక బీఎస్‌పీ దళిత రాజకీయాలను అనుసరిస్తున్నది. 2014లో అదిఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. అయితే 19.77శాతం ఓట్లను తెచ్చుకుంది. బీజేపీ బాగా దెబ్బతిని 7.5 ఓట్లు మాత్రమే పొందింది. ఫలితంగా 2019లో ఆ పార్టీ 71 సీట్లను గెలుచుకుంది. బీఎస్‌పీ అంతకుముందు వలే 19.43శాతం ఓట్లు తెచ్చుకుని ఈ సారి 10సీట్లను గెలుచుకుంది. 2014లో వచ్చిన ఓట్లకంటే 0.34శాతం ఓట్లు తగ్గాయి కూడా. 2022లో అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో వచ్చిన ఫలితం బీజేపీ నాయకత్వాన్ని తీవ్రంగా ఆందోళనకు గురి చేసింది. 2017లో 309 సీట్లను గెలుచుకున్న బీజేపీ 2022లో తీవ్ర కృషి అనంతరమే 255సీట్లను మాత్రమే గెలుచుకోగలిగింది. 2022లో బీఎస్‌పీ ఓట్లు అంతక్రితం కంటే 1శాతం తగ్గినప్పటికీ 111సీట్లు సాధించింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతం కేవలం 41.29మాత్రమే ఉంది. 2017లో గెలుచుకున్న సీట్ల కంటే 2022లో 57సీట్లను కోల్పోయింది.

-ఎడిట్ పేజి డెస్క్

శాస్త్ర జ్ఞానాభివృద్ధే దేశానికి ఊపిరి

డా॥ కత్తి పద్మారావు

భారతదేశంలో శాస్త్రీయ భావజాలంపై ఒక నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయ హిందూ పౌరాణిక వ్యవస్థ దాడి చేస్తుంది. మొత్తం సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ధ్వంసంచేసి భూ కేంద్ర సిద్ధాంతాలతో కూడిన జ్యోతిష్యం, మూఢవిశ్వాసాలతో కూడిన భావజాలం రంగాల్ని విస్తృతం చేస్తున్నారు. దానివల్ల భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, జీవ శాస్త్రం అన్నీ సంక్షోభంలో పడుతున్నాయి. మానవుని పుట్టుక, నిర్మాణం మీదే ఇంకా సందిగ్ధ భావను విస్తృతం చేస్తున్నారు. నిజానికి భారతదేశంలో చార్వాకం, బౌద్ధం, జైనం, సాంఖ్యం విస్తరిల్లి భారతీయ భౌతిక శాస్త్రం అత్యున్నతంగా ప్రజ్వరిలించింది. ఇతర దేశాల వారు సాంఖ్య దర్శనంలోని అనేక అంశాలను తీసుకుని వారి భౌతిక శాస్త్రాన్ని అభివృద్ధి చేసుకున్నారు. సాంఖ్యం బుద్ధుణ్ణి తర్కబద్ధమైన ఆలోచనకు పురికొల్పింది. జ్ఞానం ధ్యానం నుండి వచ్చేది కాదని అది తర్కబద్ధ మైనదని హేతువివేచనా పూర్ణమని ఆయన గ్రహించాడు. సాంఖ్య దర్శనం భారతీయ తత్వ శాస్త్రాలలో హేతుబద్ధమైనది, భౌతిక వాదంతో కూడినది. ఈ దర్శనాన్ని రచించిన 'కపిలుడు' నిరీశ్వర వాదాన్ని ప్రతిపాదించాడు. ఈ దర్శనం మీద పరిశోధన చేసిన 'కీత్' "ప్రపంచం మొత్తంలో భౌతిక వాదానికి సాంఖ్య దర్శనం ప్రేరణ శక్తి" అని అన్నాడు. శాస్త్ర జ్ఞానానికి జ్ఞాన సంపద, హేతు దృష్టి, కార్యాచరణ శీలత, గ్రహణశక్తి, విశ్లేషణా శక్తి, అవసరం. అయితే ఇప్పుడు శాస్త్రాన్ని బోధించే ఆచార్యులు కూడా మూఢనమ్మకాలు కలిగి ఉండటం ఆశ్చర్యం. భౌతిక వాదాన్ని, భౌతిక శాస్త్రాన్ని, రసాయన శాస్త్రాన్ని, జీవశాస్త్రాన్ని బోధించే ఆచార్యులు కూడా వర్ణధర్మాన్ని యజ్ఞ, యాగ, కర్మకాండపై నమ్మకాన్ని, కులాచరణను కలిగి ఉండటం వల్ల శాస్త్ర జ్ఞాన బోధ పెదవుల నుండే జరుగుతుంది. కానీ అది మేధస్సుకు పదును పెట్టలేకపోతుంది. అందుకే ఇప్పుడు తిరుపతి వేంకటేశ్వరస్వామి, అన్నవరం సత్యనారాయణ స్వామి, కాశీ విశ్వేశ్వర, అమర్‌నాథ్ దేవాలయాల యాత్రకు శాస్త్రవేత్తలు క్యూ కడుతున్నారు. ఇది ఆశ్చర్యకరమైన విషయం. ఎందుకంటే పదార్థ వాదం చెప్పే ఒక ఉపాధ్యాయుడు తన భావజాలం నుండి బయటపడ లేక పదార్థం వెనుక కూడా ఏదో అదృశ్య శక్తి ఉన్నదని బోధించే దశలో ఉండటం వల్ల విశ్వవిద్యాయాల్లో ద్వైదీకృత భావజాలం పరిఢవిల్లుతుంది.

అంతేకాక ఇదే పండితులు రాజ్య హింసకు సంబంధించిన భగవద్గీతను ప్రవచించడం కూడా మనకు ఆశ్చర్యం కల్గిస్తుంది. పుక్కిట పురాణాలుగా ఉన్న భారత, భాగవత, రామాయణకథలను సినిమాలుగా, టి.వి.సీరియల్స్‌గా భ్రమణం చేయడం వల్ల శాస్త్ర జ్ఞానం నుంచి ఆవిర్భవించిన ఒక పరికరం ఎలా పుట్టిందో భారతీయ విద్యార్థులు చెప్పలేక పోతున్నారు. అందువల్ల కొన్ని కోట్ల రూపాయలు మన విశ్వ విద్యాలయాలు బోధనకు ఖర్చు పెడుతున్నా అందు నుండి ప్రపంచాన్ని కదిలించే ఒక్క నూత్న అంశం, కొత్త సిద్ధాంతం బయటకు రావడంలేదు. శాస్త్ర జ్ఞాన లోపం వల్ల ఉత్పత్తి క్రమం కూడా భారతదేశంలో తగ్గిపోతుంది. శాస్త్ర, సాంకేతికజ్ఞానంవల్ల చైనా, జపాన్, జర్మనీల్లో ఉత్పత్తి పెరిగింది. మనం నైతిక శక్తిని బోధించే బౌద్ధాన్ని విశ్వవిద్యాలయాల్లో, కాలేజీల్లో రాజకీయ పాఠశాలల్లో విస్తృతంగా బోధించక పోవడం వల్ల నైతిక శక్తి భారత దేశంలో తగ్గిపోతూ వస్తుంది. అవినీతిపరులు పెరగడం, దేశాన్ని దోచుకొని ఇతర దేశాల్లో దాచుకునే వారు పెరగడం, దేశీయ ఉత్పత్తులకు పునాదైన సాంకేతిక జ్ఞానశూన్యత వల్ల



మూఢాచారాలు పెరగడం, రాళ్ళూ, రప్పలకు బుర్రలు తాకట్టు పెట్టడంవల్ల పేరుకి నూట నలభై కోట్లమంది ఉన్నా కూడా ఆలోచించేవాళ్ళు ఇరవైకోట్ల కంటే తక్కువే ఉన్నారని మనకి అర్థమవుతుంది. మనం ఉత్పత్తి పరికరాలకంటే కూడా దేవుళ్ళు, దేవతల్ని, బాబాల్ని, స్వాముల్ని, యోగుల్ని, దోపిడీదారుల్ని, పరాన్నభుక్కులను ఎక్కువ సృష్టిస్తున్నారు. ఆకలి తీర్చే ఆహారోత్పత్తి మూల శక్తులైనవారిని హీనంగాచూస్తూ భావదారిద్ర్య ఆవేశపరులను పెంచుతున్నారు. మనం తినే ఆహారం ఎక్కడి నుండి వస్తుంది? దానికి మూల కారణమైన సూర్యరశ్మి, నీరు, నేల, శ్రమకి సంబంధించిన సమస్యలతో జ్ఞానం బాగా లోపించింది. శ్రామికున్ని హీనంగా చూస్తూ విగ్రహాలను కొనియాడటం వల్ల అబద్ధపు ప్రవచనాలకు బుర్రలు తాకట్టులోకి వెళ్తున్నాయి. రాగ ద్వేషాలను, కుల, మత వైరుధ్యాలను పెంచే సంఘర్షనోన్మాద, యుద్ధోన్మాదాన్ని పెంచే కల్పిత యుద్ధ గాథల ప్రవచనాల వల్ల, దృశ్యాల వల్ల భారతదేశం నిరంతరం కుల,మత ఘర్షణలతో అట్టుడుకుతోంది. బౌద్ధ భారత నిర్మాణం వల్ల నైతిక శక్తి పెరుగుతుంది. పగతో పగ చల్లారదు. ప్రేమ వల్లే పగ చల్లారుతుంది అనే ధమ్మ పథం సూత్రాలు నేడు అవసరం. స్థిర మతిత్వంతో, సంయమనంతో, కోప రహితుడిగా ఉండి నిబ్బరంగా, నిజాయితీగా ఉండే విజ్ఞానవంతుడు వరదల ధాటికి మునగని దీవి' లాంటి వాడని అటువంటి స్థిరత్వాన్ని శాస్త్రజ్ఞులు సాధించాలని బౌద్ధబోధనలు చెబుతున్నాయి. శాస్త్రజ్ఞానం దేశ, ప్రపంచ విధ్వంసానికి దారితీయకూడదు. ప్రపంచ, దేశ అభివృద్ధికి శాస్త్ర జ్ఞానం ఉపకరణమవ్వాలి. ఈ రోజున ఎక్కడ చూసినా మతఘర్షణలు పెరుగుతున్నాయి. కులోన్మాదం పెరుగు తుంది. దేశంలో అత్యున్నత పదవుల్లో ఉన్నవారు కూడా శాస్త్రీయ లౌకిక బోధనలు చేయ వలసిన దగ్గర మత, వర్ణవివక్షను పురికొల్పే బోధనలుచేయడం ఆశ్చర్యం కల్గిస్తుంది. ఈరోజు శాస్త్రజ్ఞానం ప్రకారం మనిషి శరీరంలోని పుర్రె గానీ, చర్మ వర్ణం గానీ, జుట్టు గానీ, స్వరపేటిక గానీ, మరే ఇతర శరీర భాగంలో కానీ జాతి వ్యత్యాసాలు కన్పించడం లేదు. పుట్టుకలో గానీ, మరణంలో గానీ మానవులందరూ ఒకేరకంగా ఉన్నారు. ఒకేకులంలోని వ్యక్తులు కూడా అనేకవృత్తులు చేపడుతున్నారు. కానీమనసుల్లో వర్ణ బేధాలు, కుల బేధాలు, మూఢనమ్మకాలు ఉండడం వల్ల తమను తాము మనుషులుగా గుర్తించలేక పోతున్నారు. గొప్ప జీవశాస్త్రజ్ఞానమున్నవాళ్ళు కూడా మంత్రగాళ్లకు, జ్యోతిష్యులకు దిన, వారఫలాలకు లొంగిపోతున్నారు. వ్యవసాయదారులు, వర్తకులు, విద్యావంతులు కూడా ఈ మంత్రగాళ్ళకు బానిసలవుతున్నారు. అందువల్ల శాస్త్రజ్ఞానం జీవితంలో ఫలించడం లేదు. అవినీతిద్వారా సంపాదించిన డబ్బు తీసుకెళ్ళి దేవునిహుండీల్లో వేస్తున్నారు. అన్నిహుండీలు నల్లధనం పోగు చేసేవిగా మారాయి. మనిషి పవిత్రత, అపవిత్రత అనేది ప్రవర్తనవల్ల రుజువు కావాలి కానీ దేవుడికిఇచ్చే కానుకలు వల్ల కాదు. దొంగలు, అవినీతి పరులు, అప్పుచేసి ఇతర దేశాలకు పారిపోయే వారంతా గొప్ప భక్తులుగా చెలామణీ అవు తున్నారు. నిజమైన శాస్త్రజ్ఞులకు సరైన గుర్తింపు, ఆదరణ లేదు.

మన శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధి తెచ్చిన ఫలితాలతో ముందుకు వెళ్ళవలసిన చారిత్రక సందర్భం వచ్చింది. భారత రాజ్యాంగం 51వ ఆర్టికల్ ప్రకారం శాస్త్ర విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారానే ప్రజా జీవన సమృద్ధికి ప్రేరణ జరుగుతుంది. ఉత్పత్తి, జ్ఞానం, విద్య సాంకేతికతల సమన్వయంతో భారతదేశం ముందుకు వెళ్ళవలసిన అవసరం ఉంది. అప్పుడే డా.బి.ఆర్.అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం జీవితాల్లో ప్రతిఫలిస్తుంది.

సామాజిక ఉద్యమ నాయకులు, 9849741695

ప్రజాస్పందనపైనే ప్రజాస్వామ్య భవిష్యత్తు

డాక్టర్ సీ.ఎన్. క్షేత్రపాల్ రెడ్డి,
9059837847

భారత ప్రధాని, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ల మధ్య చర్చల జాబితాలో లేని కీలకాంశం ప్రజాస్వామ్యం. భారత్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అంతర్జాతీయ మీడియా సంస్థలు అనేక కథనాలు ప్రచురించినా ప్రధాని వాటికి సమాధానం ఇవ్వకుండానే తిరిగి వచ్చారు. రాహుల్ గాంధీ అమెరికాలో చేసిన వ్యాఖ్యలపై ఇంటా బయటా తీవ్రంగా విరుచుకుపడిన ప్రధాని మోదీ అక్కడి మీడియా చేసింది కేవలం ఆరోపణలే అయితే మరింత తీవ్రంగానే విరుచుకుపడేవారు. కానీ అక్కడి మీడియా చాలా స్వతంత్రంగా, నిష్పక్షపాతంగానే విమర్శనాత్మక కథనాలు అందించింది. ప్రజాస్వామ్యంలో కీలకంగా ఉండే ప్రశ్నించే తత్వాన్ని మోదీ ప్రభుత్వం ఎలా అణచి వేస్తోందో ఉదాహరణలతో సహా వెలుగులోకి తెచ్చింది. ప్రశ్నించే గొంతుకలకు చుక్కానిగా నిలుస్తున్న మీడియా సంస్థలపై, జర్నలిస్టులపై దేశద్రోహం వంటి క్రూర చట్టాలను ప్రయోగించి జైళ్లలో కుక్కిన ఉదంతాలను ప్రచురించి ఇదేనా ప్రజాస్వామ్య దీపిక అంటూ ఘాటుగానే నిలదీసింది. అసలు మీడియా సమావేశాలకు నిత్యం ముఖం చాటేసే ఆయన అనుకోకుండా వైట్‌హౌస్‌లో మీడియా సమావేశంలో పాల్గొనాల్సి రావడం, అక్కడ ఎదురైన ఒకే ఒక ప్రశ్న ఇరుకున పెట్టింది. సమాధానంగా భారత్‌లో మత విద్వేషమనేది లేనేలేదని చెప్పారు. మోదీ భారత్ చేరక ముందే ఆ ప్రశ్న వేసిన మీడియా ప్రతినిధి సబ్రినా సిద్దిఖిపై మోదీ అనుయాయులు, వాట్సప్ యూనివర్సిటీ భక్తులు విద్వేషం వెళ్లగక్కడం మన కళ్లముందే ఉంది. వైట్‌హౌస్ కూడా మోదీని ప్రశ్నించిన మీడియా ప్రతినిధిపై భారత్‌లో సాగిన విద్వేషంపై ఘాటుగా స్పందించి ఆమెకు మద్దతు ప్రకటించింది. దీంతో వైట్‌హౌస్ సాక్షిగా భారత్‌లో విద్వేషం లేదని మోదీ చెప్పడం బుకాయింపని తేలిపోయింది.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మాత్రమే ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందనుకుంటే పొరపాటే. ప్రజాస్వామ్య వ్యతిరేకత రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) డీఎన్ఏలోనే ఉంది. నియంతగా పేరుపొందిన ముసోలినీ అవలంబించిన ఫాసిజం సూత్రాలకు అనుగుణంగా తయారైన సిద్ధాంతమే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం. దీన్ని ముసోలినీ ఫాసిజానికి భారతీయ వెర్షన్ అన్నా తప్పుకాదు. భారతదేశంలో ప్రజాస్వామ్య పతనాన్ని అర్థం చేసుకోవాలంటే ఆర్ఎస్ఎస్, బీజేపీ మూలాలను అర్థం చేసుకోవాలి. ఆర్ఎస్ఎస్ పుట్టుక మొదలు నేటి వరకూ భారత దేశాన్ని జాతి, మతం అనే అంశాల ద్వారానే నిర్వచిస్తోంది. అందుకే ప్రజలంతా స్వాతంత్ర్యం కోసం పోరాటం చేస్తున్నా స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా ఆ సంస్థ పని చేసింది. వలస పాలనకు మద్దతు పలికింది. స్వాతంత్ర్య పోరాటం ఉవ్వెత్తున ఎగుస్తుండడాన్ని చూసిన ఆ సంస్థ సర్ సంచాలక్ గోల్వాల్కర్ వలస పాలన అంతరిస్తే భారతదేశం హిందూ దేశంగా ఉండాలని కోరుకున్నారు. ఈ ఆకాంక్షను ప్రతిఫలించేలా 1939లోనే 'వి ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్' శీర్షికతో తన ఆలోచనలకు ఒక పుస్తక రూపం ఇచ్చారు. భారతదేశంలో విదేశీ జాతులుండా లంటే హిందూ జాతిలో విలీనం కావాలి, లేదా తమ ప్రత్యేక అస్తిత్వాన్ని కోల్పోవాలని పేర్కొన్నారు. ఎటువంటి హక్కులు, అధికారాలు లేకుండా జీవించాలని వాదించడానికి ఆయనలోని ప్రజాస్వామ్య వ్యతిరేకతే కారణం. ఆయన యూదులపై నాజీలు చేసిన దమనకాండను ప్రశంసించారు. ఇది హిందుత్వ వాదులకు ఆదర్శం కావాలని ప్రోత్సహించారు.

అయితే ఈ ఆలోచనలేవీ స్వాతంత్ర పోరాటంలో ఉన్న నాటి సమాజాన్ని ప్రభావితం చేయలేకపోయాయి. స్వాతంత్ర్యానంతరమూ ఈ ఆలోచనలకు మద్దతు దక్కలేదు. మతం, జాతి, కులం, లింగం ఆధారంగా ప్రజలపై ఎటువంటి వివక్ష ఉండకూడదని భారత రాజ్యాంగం స్పష్టం చేసింది. ఈ కారణం చేతనే భారత రాజ్యాంగాన్ని అంగీకరించబోమని, మనువాదమే తమ చివరి రాజ్యాంగమని చాలా స్పష్టంగా ఆర్ఎస్ఎస్ ప్రకటించింది. ఆర్ఎస్ఎస్‌కు రాజకీయ ముఖంగా ఏర్పాటైన భారతీయ జనసంఘ్‌కు ప్రజాదరణ, ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు దక్కకపోవడంతో 1980 నాటికి భారతీయ జనతా పార్టీగా రూపాంతరం చెందింది. మత రాజకీయాలనే నమ్ముకుంది. 1998లో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరచింది. దేశ రాజ్య స్వభావాన్ని మార్చడానికి తీవ్రమైన చర్యలేవీ తీసుకోలేకపోయినా మతతత్వ భావజాలం మారలేదు కాబట్టే గోద్రా అల్లర్లకు అండగా ఉన్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న నరేంద్ర మోదీని 2014లో ప్రధాని అభ్యర్థిగా ఆర్ఎస్ఎస్ ముందుకు తెచ్చింది.

మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఫాసిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేయడం కోసమే తమ అధికారాన్ని ఉపయోగించడం మన కళ్లముందుంది. అధికారాన్ని ఏకీకృతం చేయడం ద్వారానే ప్రజస్వామ్యం మనుగడను పూర్తిగా రూపుమాపాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇందులో భాగంగానే స్వయం ప్రతిపత్తి కలిగిన న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషన్ సహా వివిధ దర్యాప్తు

ఈ క్రమంలో దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలమా అనే చర్చ తీవ్రమైంది. వాస్తవానికి ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడటం ఇది తొలిసారి కాదు. ఇందిరా గాంధీ పాలన నేటి మోదీ ప్రభుత్వానికి భిన్నమైనదైనా ఆమె విధించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టయ్యింది. దాదాపు రెండేళ్ల పాటు దేశంలో నిరంకుశత్వం రాజ్యమేలింది. ఈ నిరంకుశత్వం కారణంగానే ఇందిర అధికారానికి దూరమైంది. కాబట్టి ప్రజాస్వామ్య భవిష్యత్తు దేశ ప్రజల ఆలోచనా సరళిపై ఆధారపడి ఉంటుంది. 2024లో సార్వత్రిక ఎన్నికలున్నాయి. నేడు అధికారంలో ఉన్న బీజేపీని ఓడించడం అసాధ్యమేమీ కాదు. తాజాగా కర్నాటక ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం. ఎవర్జెన్సీ రూపంలో ప్రజాస్వామ్యానికి పాతరేసిన ఇందిరను గద్దె దించిన ప్రజలు మోదీని దించలేని అశక్తులు కారు. ఇప్పటికే దేశంలోని ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏకమవుతున్నట్టు సంకేతాలిచ్చిన నేపథ్యంలో ప్రజా ప్రతిస్పందనపైనే ప్రజాస్వామ్య భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

సంస్థలను నిర్వీర్యం చేస్తూ వచ్చారు. 2019ల్లోనూ మరోసారి గెలవడంతో ప్రజస్వామ్యం పీక నులిమే పనిని వేగవంతం చేసినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. నూతన పార్లమెంటు భవనం ప్రారంభం పేరుతో రాష్ట్రపతిని మనందరి కళ్ల ముందే అవమానించి ప్రజాస్వామ్య సౌధాన్ని బుల్డోజ్ చేశారు. ఎన్నికల పర్యవేక్షణ అధికారం ఉన్న ఎన్నికల కమిషన్ స్వతంత్రతను పూర్తిగా దెబ్బతీసి తమ అడుపాజ్ఞల్లో ఉండే సంస్థగా, న్యాయ వ్యవస్థను తమకు అనుకూల తీర్పులిచ్చే వ్యవస్థగా మార్చుకున్నారనే ఆరోపణలున్నాయి. న్యాయమూర్తులను ఇందుకు పావులుగా వాడుకున్నారు. తమకు అనుకూల తీర్పు ఇచ్చిన ఒక ప్రధాన న్యాయమూర్తి పదవీ విరమణ చేయగానే రాజ్యసభలో సీటు కల్పించడమే ఇందుకు నిదర్శనమనేది విమర్శకుల వాదన.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లువేసి తన నియంత్రణను పెంచుకుంది. ప్రభుత్వానికి ఇరుసులుగా పనిచేస్తున్న అంబానీ చేతుల్లోకి 27 ఛానళ్లు, అదానీ చేతుల్లోకి 11 ఛానళ్లు చేరాయి. ప్రభుత్వ పెద్దల సహకారంతో ఎన్‌డీటీవీని అదానీ చేతుల్లోకి తీసుకోవడమే ఇందుకు తాజా ఉదాహరణ. అంతర్జాతీయ మీడియాపైనా ప్రభుత్వమే అక్కసును వెళ్లగక్కుతోంది. గుజరాత్ మారణ హోమంపై డాక్యుమెంటరీని రూపొందించి ప్రచారం చేసిన బీబీసీపై కక్ష పూరితంగా వ్యవహరించింది. ప్రభుత్వానికి కంటగింపుగా మారిన సోషల్ మీడియాను నియంత్రించడానికి ఒక అధికారిక ప్యానెల్‌ను కూడా రూపొందించింది. పౌరసత్వ సవరణ చట్టం, వ్యవసాయ నల్ల చట్టాలు, బ్యాంకింగ్ సవరణ చట్టం, కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడం, పాఠ్యపుస్తకాలను మార్చడం, ఎన్నికలు దగ్గర పడుతుండడంతో మతవిద్వేషాలను రగిలించేలా తాజాగా ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) తుట్టెను కదపడం ఇవన్నీ ఒక క్రమ పద్ధతిలో ప్రజాస్వామ్యంపై చేస్తోన్న దాడులే. తన ప్రభుత్వం కేవలం మెజారిటీ మతానికి సంబంధించినదే అనేలా రూపొందించిన కార్యక్రమాల్లో ప్రధాని పాల్గొనడం ప్రజాస్వామ్య వ్యతిరేకతను బహిరంగంగానే ప్రదర్శించడమే. రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వం రద్దు కూడా ఈ చర్యల్లో భాగమే. ఇటీవల ఏకంగా పాఠశాల స్థాయిలో ప్రజస్వామ్యం అంశాన్ని సిలబస్ నుంచి తొలగించడం కూడా గమనించదగిన పరిణామం.

ఈ క్రమంలో దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలమా అనే చర్చ తీవ్రమైంది. వాస్తవానికి ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడటం ఇది తొలిసారి కాదు. ఇందిరా గాంధీ పాలన నేటి మోదీ ప్రభుత్వానికి భిన్నమైనదైనా ఆమె విధించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టయ్యింది. దాదాపు రెండేళ్ల పాటు దేశంలో నిరంకుశత్వం రాజ్యమేలింది. ఈ నిరంకుశత్వం కారణంగానే ఇందిర అధికారానికి దూరమైంది. కాబట్టి ప్రజాస్వామ్య భవిష్యత్తు దేశ ప్రజల ఆలోచనా సరళిపై ఆధారపడి ఉంటుంది. 2024లో సార్వత్రిక ఎన్నికలున్నాయి. నేడు అధికారంలో ఉన్న బీజేపీని ఓడించడం అసాధ్యమేమీ కాదు. తాజాగా కర్నాటక ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం. ఎవర్జెన్సీ రూపంలో ప్రజాస్వామ్యానికి పాతరేసిన ఇందిరను గద్దె దించిన ప్రజలు మోదీని దించలేని అశక్తులు కారు. ఇప్పటికే దేశంలోని ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏకమవుతున్నట్టు సంకేతాలిచ్చిన నేపథ్యంలో ప్రజా ప్రతిస్పందనపైనే ప్రజాస్వామ్య భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

ఉగ్రవాదంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలు వద్దు

ఎస్‌సీవో వర్చువల్ సదస్సులో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : ఉగ్రవాద కార్యకలాపాలను ఎదుర్కోవడంలో ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని, దేశ విధానంలో భాగంగా సీమాంతర ఉగ్రవాదానికి మద్దతిచ్చే దేశాలను విమర్శించడానికి సంకోచించకూడదని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం పాక్‌ను ఉద్దేశించి ఎస్‌సీవో దేశాల నేతలతో అన్నారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యాకు చెందిన వ్లదిమిర్ పుతిన్‌తో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) వర్చువల్ సదస్సులో మోదీ మాట్లాడుతూ ఉగ్రవాదం, ఉగ్రవాదానికి ఆర్థిక సాయాన్ని ఎదుర్కోవడానికి నిర్ణయాత్మక చర్య తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉగ్రవాదం ప్రాంతీయ, ప్రపంచ శాంతికి ముప్పుగా పరిణమించిందని, ఈ ముప్పును ఎదుర్కోవడానికి పరస్పర సహకారాన్ని విస్తరించుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఉగ్రవాదంపై పోరులో ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని ప్రధాని మోదీ నొక్కివక్కాణిస్తూ, 'ఏ రూపంలోనైనా, ఎలాంటి అభివ్యక్తిలోనైనా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మనం కలిసి పోరాడాలి. భారత అధ్యక్షతన జరిగిన వర్చువల్ సదస్సుకు కజకిస్తాన్, కిర్గిజ్‌స్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, ఇరాన్ నాయకులు కూడా హాజరయ్యారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రధాని మోదీ వివిధ ప్రపంచ సవాళ్లను కూడా ప్రస్తావించారు. వివాదాలు, ఉద్రిక్తతలు, అంటువ్యాధులు చుట్టుముట్టబడిన ప్రపంచంలోని అన్ని దేశాలకు ఆహారం, ఇంధనం, ఎరువుల సంక్షోభం పెద్ద సవాలు అని, దీనిని ఎదుర్కోవడానికి ఐక్యంగా కృషి చేయాలని ఆయన అన్నారు. యురేషియాకు శాంతి, శ్రేయస్సు, అభివృద్ధికి ఎస్‌సీవో కీలక వేదికగా ఉద్భవించిందని ప్రధాని అన్నారు. ఈ ప్రాంతం (యురేషియా) తో భారతదేశానికి వేల సంవత్సరాల నాటి సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాలు మన భాగస్వామ్య వారసత్వానికి సజీవ సాక్ష్యంగా ఉన్నాయన్నారు. ఎస్‌సీవో అధ్యక్షుడిగా భారతదేశం మా బహుముఖ సహకారాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడానికి నిరంతర ప్రయత్నాలు చేసింది. ఎస్‌సీవో సంస్కరణ, ఆధునీకరణ ప్రతిపాదనకు భారతదేశం మద్దతు ఇస్తుందని కూడా ఆయన చెప్పారు. స్టార్టప్, ఆవిష్కరణ, సాంప్రదాయ వైద్యం, యువత సాధికారత, డిజిటల్ చేరిక, భాగస్వామ్య బౌద్ధ వారసత్వం వంటి ఐదు సహకార స్తంభాలను భారతదేశం ఎస్‌సీవోలో ఏర్పాటు చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఎస్‌సీవో సంస్కరణలు, ఆధునికీకరణ ప్రతిపాదనకు భారతదేశం మద్దతు ఇస్తుందన్నారు. 'ఇరాన్ కొత్త సభ్యుడిగా ఎస్‌సీవో కుటుంబంలో చేరబోతున్నందుకు నేను సంతోషంగా ఉన్నాను' అని చెప్పారు. బెలారస్ ఎస్‌సీవో సభ్యత్వం కోసం నిబద్ధతకు సంబంధించిన పత్రంపై సంతకం చేయడాన్ని కూడా ప్రధాన మంత్రి స్వాగతించారు. ప్రజలకు ప్రజలకు మధ్య అనుబంధాన్ని మరింతగా పెంచాలనే ఉద్దేశంతో భారత అధ్యక్షతన అనేక సంతకాల కార్యక్రమాలు జరిగాయి. ఎస్‌సీవోతో భారతదేశ అనుబంధం 2005లో పరిశీలక దేశంగా ప్రారంభమైంది. 2017లో జరిగిన అస్తానా సదస్సులో ఇది ఎస్‌సీవో పూర్తి సభ్య దేశంగా అవతరించింది. భారతదేశం ఎస్‌సీవో, దాని ప్రాంతీయ ఉగ్రవాద నిరోధక నిర్మాణం (ఆర్‌ఏటీఎస్) తో భద్రత, రక్షణకు సంబంధించిన సహకారాన్ని మరింతగా పెంచుకోవడంలో ఆసక్తిని కనబరిచింది. రష్యా, చైనా, కిర్గిజ్ రిపబ్లిక్, కజకిస్తాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్ అధ్యక్షులచే 2001లో షాంఘైలో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో ఎస్‌సీవో స్థాపితమైంది. భారతదేశం, పాకిస్తాన్ 2017లో ఎస్‌సీవో పూర్తి సభ్యదేశాలు అయ్యాయి.

విపక్ష నేతపై తర్వాత నిర్ణయం: కాంగ్రెస్

ముంబై: మహారాష్ట్రలో కాంగ్రెస్ శాసనసభాపక్ష(సీఎల్‌పీ) సమావేశం మంగళవారం జరిగింది. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి అంశంపై సమావేశం చర్చించలేదని, రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగవంతంగా మారుతున్నందున వేచిచూసే ధోరణి అవలంబించాలని నిర్ణయించినట్లు పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు చెప్పారు. ఎన్‌సీపీ నేత అజిత్ పవార్ శాసనసభాపక్ష నేత పదవికి రాజీనామా చేయడం, శివసేన-బీజేపీ ప్రభుత్వంలో చేరడంతో ప్రతిపక్ష పదవిపై చర్చించాల్సి ఉందని కాంగ్రెస్ ఇంతముందుకు ప్రకటించింది. పార్టీని, మహా వికాస్ అఘాదీ కూటమిని పటిష్టవంతం చేయడానికి కృషి చేయాలని విధాన్ భవన్‌లో జరిగిన సీఎల్‌పీ సమావేశంలో కాంగ్రెస్ నిర్ణయించినట్లు ఆ నాయకుడు చెప్పారు. ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి హెచ్‌కే పాటిల్, సీఎల్‌పీ నేత బాలాసాహెబ్ థొరాట్, 45మందికిగాను 39 మంది శాసనసభ్యులు సమావేశానికి హాజరయ్యారు. 'మహా వికాస్ అఘాదీ, కాంగ్రెస్‌ను పటిష్టవంతం చేస్తాం. ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌కు మేము మద్దతిస్తాం. తాజా రాజకీయ పరిణామాలను వేచిచూస్తున్నాం' అని హెచ్‌కే పాటిల్ చెప్పారు. ప్రతిపక్ష నాయకుడి పదవిపై చర్చించలేదని ఆయన తెలిపారు. ప్రజాసమస్యలపై కాంగ్రెస్ పోరాడుతుందని, బీజేపీ, రాజ్యాంగేతర, అనైతిక ప్రభుత్వంపై ఐక్యంగా పోరాడతామని పాటిల్ చెప్పారు. ఇటీవల మృతిచెందిన పార్టీ ఎంపీ సురేశ్ ధనోర్కర్‌కు సమావేశం నివాళి అర్పించింది.

బ్రిజ్ భూషణ్‌పై కేసు రద్దు నివేదికపై మీ స్పందనేమిటి?

న్యూఢిల్లీ : మైనర్ రెజ్లర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లుగా తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన రద్దు నివేదికపై మంగళవారం ఇక్కడ కోర్టు 'బాధితుడు', ఫిర్యాదుదారు నుంచి ప్రతిస్పందనను కోరిందని ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది తెలిపారు. అదనపు సెషన్స్ జడ్జి ఛవీ కపూర్ ఇన్-ఛాంబర్ ప్రొసీడింగ్స్ సమయంలో బాధితురాలికి/ఫిర్యాదుదారుకి నోటీసు జారీ చేశారు. కోర్టు ఈ విషయాన్ని తదుపరి విచారించే ఆగస్టు 1 లోపు పోలీసు నివేదికపై వారి ప్రతిస్పందనను దాఖలు చేయాలని వారిని ఆదేశించారు. ఈ కేసును రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీ పోలీసులు జూన్ 15న కోర్టుకు నివేదిక సమర్పించారు.

మోదీలాంటి నాయకుడు మరొకరు లేరు: అజిత్ పవార్

ముంబై : ప్రధాని నరేంద్ర మోదీ లాంటి నాయకుడు లేడని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మంగళవారం అన్నారు. 'ఆయన (మోదీ) నాయకత్వంలో దేశం ముందుకు సాగుతోంది. ఆయనకు మద్దతుగా ప్రభుత్వంలో చేరాము' అని దక్షిణ ముంబైలో తన ఎన్‌సీపీ విభాగం కొత్త కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం అజిత్ పవార్ అన్నారు. 'మోదీ లాంటి నాయకుడు లేడు. అతనికి ప్రత్యామ్నాయం లేదు' అని తెలిపారు. రాష్ట్ర మంత్రివర్గంలో శాఖల కేటాయింపును వెంటనే ప్రకటించకపోవచ్చని అన్నారు. మంత్రివర్గంలో చేరడంపై షిండే గ్రూపులోని కొందరు సభ్యులు అసంతృప్తిగా ఉన్నారా అని అడిగినప్పుడు, అసంతృప్తికి సంబంధించిన ప్రశ్నే లేదని తెలిపారు.

ఎస్‌టీ జాతీయ కమిషన్ చైర్మన్ రాజీనామా

న్యూఢిల్లీ: ఎస్‌టీ జాతీయ కమిషన్(ఎన్‌సీఎస్‌టీ) చైర్మన్ హర్ష చౌహాన్ మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. తన పదవీకాలం ముగియడానికి 8 నెలల ముందే ఆయన రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. కాగా, అటవీ, గిరిజన హక్కులపై కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖతో ఘర్షణ కారణంగానే హర్ష చౌహాన్ మూల్యం చెల్లించుకున్నారని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. మరోవైపు, ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయడంలో విఫలమైనందుకే చౌహాన్ రాజీనామా చేసినట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. 'చౌహాన్ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆయన రెండు సమావేశాలకు మాత్రమే హాజరయ్యారు. ఎస్‌టీ జాతీయ కమిషన్ బాధ్యతలను ఇక నుంచి కమిషన్ సభ్యుడు అనంత నాయక్ చూస్తారు' అని అధికార వర్గాలు పీటీఐకి తెలిపాయి. ఎన్‌సీఎస్‌టీ నిబంధనల ప్రకారం కమిషన్ సమావేశాలు నిర్వహించే బాధ్యత చైర్‌పర్సన్‌దేనని, చైర్‌పర్సన్ గైర్హాజరీలో ఉపాధ్యక్షుడు సమావేశాలు నిర్వహిస్తాడని ఎన్‌సీఎస్‌టీ సీనియర్ అధికారి చెప్పారు. చౌహాన్ జూన్ 26న రాజీనామా చేయగా 27న రాష్ట్రపతి ఆమోదం తెలిపారని ఆయన వివరించారు. గిరిజన హక్కుల పరిరక్షణ కోసం చౌహాన్ కృషి చేసిన కారణంగానే ఆయనను ఎస్‌టీ జాతీయ కమిషన్ చైర్మన్ పదవి నుంచి తొలగించినట్లు ప్రచారం జరుగుతోంది. మోదీ సర్కారు మాట వినని కారణంగానే 8 నెలల ముందుగానే చౌహాన్ బలవంతంగా రాజీనామా చేయాల్సి వచ్చిందని జైరాం రమేశ్ ట్వీట్ చేశారు.

అజిత్ పవార్‌కు చుక్కెదురు

కొత్త కార్యాలయం తాళాలు మిస్సింగ్

ముంబై: శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీని చీల్చి... బీజేపీ-శివసేన కూటమితో చేతులు కలిపిన అజిత్ పవార్‌కు మంగళవారం చేదు అనుభవం ఎదురైంది. కొత్త కార్యాలయంలోకి ప్రవేశించాలని అజిత్ పవార్ భావించగా...ఆ బంగళా తాళాలు కనిపించకపోవడంతో నేతలంతా బంగళా వెలుపల కూర్చున్నారు. తాళాల కోసం అనేకమందికి నాయకులు ఫోన్లు చేశారు. ఎట్టకేలకు ప్రవేశ మార్గంలోని తలుపు తాళాన్ని తొలగించగలిగినప్పటికీ, బంగళా లోపలి గదుల తాళాలు మాత్రం దొరకలేదు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ వర్గంలోని యువ నేతలు ఈ బంగళా సింహద్వారం తాళాలను పగులగొట్టారు. ఆ తర్వాత నేతలు లోపలికి వెళ్లారు. కానీ ఆ బంగళాలోని గదుల తాళాలు కనిపించకపోవడంతో అందరూ హతాశులయ్యారు. ఈ బంగళాలో గతంలో మహారాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నేత అంబాదాస్ దాన్వే ఉన్నారు. ఆయన ఉద్ధవ్ ఠాక్రేకు విధేయుడు. ఆయనకు వేరొక బంగళాను కేటాయించారు. అజిత్ పవార్ ఈ బంగళాను తన పార్టీ కార్యాలయం కోసం ఎంపిక చేసుకున్నారు.

ఇదిలావుండగా, ఎన్‌సీపీ నేత అప్పా సావంత్ మాట్లాడుతూ దాన్వే వ్యక్తిగత సహాయకుడు బంగళాకు తాళం వేసి, వెళ్లిపోయినట్లు తెలిపారు. ఈ బంగళా లోపల తాము అన్ని ఏర్పాట్లు చేసుకున్నామని చెప్పారు. తాము ఆయనకు ఫోన్ చేశామని, వచ్చేస్తున్నానని చెప్పారని తెలిపారు. దీని వెనుక ఏదో కుట్ర ఉందని ఆరోపించారు. ఇదిలావుండగా, ఎన్‌సీపీ తనదంటే తనదని అజిత్ పవార్, శరద్ పవార్ వాదిస్తున్నారు. కానీ వీరు తమకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల వివరాలను బయటపెట్టడం లేదు. పార్టీ, ఎన్నికల గుర్తు కోసం న్యాయ పోరాటం చేయడానికి రెండు వర్గాలు సమాయత్తమవుతున్నాయి. ఏక్‌నాథ్ షిండే మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా అజిత్ పవార్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ఆయన వర్గానికి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు లభించాయి.

ఎంవీఏ ఐక్యంగా ఉంది

శరద్ పవార్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

ముంబై : మహారాష్ట్రలోని మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) శివసేన-బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికి కార్యకర్తలను ఉత్తేజపరిచేందుకు రాష్ట్రవ్యాప్త పర్యటనను ప్రారంభించింది. కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఇక్కడ ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్‌ను కలుసుకున్నారు. ఆయన పార్టీలో సంక్షోభం మధ్య పవార్‌కు సంఘీభావం తెలిపారు. సీనియర్ నాయకుడు అజిత్ పవార్ శివసేన-బీజేపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేరడంతో పాటు మంత్రులుగా ప్రమాణం చేసిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలతో పాటు ఎన్‌సీపీలో గందరగోళం నెలకొంది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 53 మంది ఎమ్మెల్యేలలో 40 మంది మద్దతు ఉందని అజిత్ పవార్ వర్గం ప్రకటించింది. ఇక్కడ జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్‌పీ) సమావేశానికి హాజరయిన తర్వాత, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే, వర్కింగ్ ప్రెసిడెంట్ నసీమ్ ఖాన్ శరద్ పవార్‌ను కలవడానికి వైబీ చవాన్ సెంటర్‌కు వెళ్లారు. 'ఎన్‌సీపీ శాసనసభా పక్షంలో చీలిక కోసం బీజేపీ రూపొందించిన విధానాన్ని కాంగ్రెస్ ఖండిస్తోంది. ఎంవీఏ ఐక్యంగా ఉండి బీజేపీని ఓడిస్తుంది' అని ఎన్‌సీపీ అధ్యక్షుడిని కలిసిన తర్వాత పటోలే విలేకరులతో అన్నారు. కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడు బాలాసాహెబ్ థోరట్ మాట్లాడుతూ ప్రస్తుత సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు మనతో ఉన్నందున ఎంవీఏ మరింత బలపడుతుందని అన్నారు. 'కాంగ్రెస్ ఐక్యంగా ఉంది. శరద్ పవార్ సీనియర్ నాయకుడు, మార్గదర్శకత్వం కోసం మేమంతా ఆయన వైపు చూస్తున్నాము' అని తెలిపారు. ఏక్‌నాథ్ షిండే-బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు తమ కార్యకర్తలను ఉత్తేజపరిచేందుకు ఎంవీఏ త్వరలో రాష్ట్రవ్యాప్త పర్యటనను ప్రారంభించనుందని నసీమ్ ఖాన్ తెలిపారు. పవార్‌కు కాంగ్రెస్ సంఘీభావం తెలిపిందని, ఐక్యంగా పని చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. జులై 8న శరద్ పవార్ నాసిక్‌లో పర్యటించనున్నట్లు ఎన్‌సీపీ అధికార ప్రతినిధి తెలిపారు.

నా భావజాలానికి ద్రోహం చేశారు

- అలాంటప్పుడు నా ఫొటో ఉపయోగించకూడదు
- ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్

ముంబై : తన భావజాలానికి ద్రోహం చేసిన వారికి తన ఫోటోను ఉపయోగించేందుకు అనుమతి లేదని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ మంగళవారం స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా జయంత్ పాటిల్ ఉన్న పార్టీనే తన ఫొటోను ఉపయోగించుకునే హక్కు ఉందని ఆయన ఉద్ఘాటించారు. తన జీవితకాలంలో తన ఫోటోను ఎవరు ఉపయోగించుకోవాలో నిర్ణయించే ఏకైక అధికారం తనకు ఉందని పవార్ నొక్కి చెప్పారు. 'నా భావజాలానికి ద్రోహం చేసిన వారు, నాతో సైద్ధాంతిక విభేదాలు ఉన్నవారు నా ఛాయాచిత్రాన్ని ఉపయోగించలేరు' అని ప్రముఖ నాయకుడు తెలిపారు. తన మేనల్లుడు అజిత్ పవార్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు మహారాష్ట్రలోని బీజేపీ-శివసేన ప్రభుత్వంలో చేరిన రెండు రోజుల తర్వాత పవార్ ఈ ప్రకటన చేశారు. అజిత్ పవార్ వర్గం కూడా జయంత్ పాటిల్‌ను ఎన్‌సీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించింది. మరోవైపు అజిత్‌తో పాటు అతని సహచరులను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ పాటిల్ అసెంబ్లీ స్పీకర్‌కు వినతిపత్రం సమర్పించారు.

రైల్వే భద్రతపై కేంద్రం నిర్లక్ష్యం

కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ: రైల్వే భద్రతకు సంబంధించిన మౌలిక అంశాలపై నరేంద్రమోదీ ప్రభుత్వం రాజీపడుతోందని కాంగ్రెస్ పార్టీ మంగళవారం విమర్శించింది. ఒడిశాలోని బాలాసోర్‌లో ఇటీవల జరిగిన ఘోర రైలు దుర్ఘటనకు రాజకీయ నాయకత్వం, రైల్వే యాజమాన్యం వైఫల్యమే కారణమని, వీటి వల్లే మానవతప్పిదం చోటుచేసుకుందని ఆరోపించింది. రైలు ప్రమాదానికి తప్పుడు సిగ్నలింగ్ కారణమని అత్యున్నతస్థాయి విచారణ కమిటీ నివేదిక ఇచ్చింది. సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్ శాఖలో అనేకస్థాయిల్లో లోపాలు ఉన్నట్లు వెల్లడించింది. ఈ నివేదికపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ తాము చెప్పినట్లే నివేదిక ఉందని వ్యాఖ్యానించారు. వందేభారత్ రైళ్లు ప్రారంభించడంలో మోదీ సర్కారు అత్యుత్సాహం ప్రదర్శిస్తోందని, కానీ రైల్వే భద్రతకు సంబంధించి కనీస మౌలిక సదుపాయాలపై మోదీ సర్కారు దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. నిర్వహణ వైఫల్యం కారణంగానే మానవతప్పిదం చోటుచేసుకొని రైలు ప్రమాదం జరిగిందని స్పష్టంచేశారు. ఇందులో రాజకీయ నాయకత్వ వైఫల్యం కూడా ఉందని జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనతే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చాలని బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టంచేశారు. వేడివేడి భోజనం, కొత్త వందేభారత్ రైళ్లు అంటూ హంగామా చేయడం మాని...రైల్వే భద్రతపై దృష్టి కేంద్రీకరించాలని ఆమె హితవు పలికారు. ఈ నివేదిక ద్వారా ప్రభుత్వం చెప్పినవన్నీ అసత్యాలేనని తేలిందన్నారు. కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ మాట్లాడుతూ వందలమంది చనిపోయినా రైల్వేమంత్రి అశ్వనీ వైష్ణవ్ ఆ పదవిలో ఎలా కొనసాగుతున్నారని ఆశ్చర్యం వెలిబుచ్చారు.

ఢిల్లీ ఎల్‌జీకి సుప్రీం మొట్టికాయలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్, ఆప్ ప్రభుత్వం మధ్య నిత్యం ఏదో ఒక అంశంపై వివాదం నడుస్తూనే ఉంటుంది. తాజాగా ఢిల్లీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ కొత్త చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వివాదం చేసేందుకు ప్రయత్నించిన ఎల్‌జీకి సుప్రీంకోర్టు మొట్టికాయలేసింది. ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ పదవికి మాజీ న్యాయమూర్తి ఉమేష్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయించాల్సిందిగా కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని ఆదేశించకూడదని కోర్టు హెచ్చరించింది. ప్రమాణస్వీకారోత్సవాన్ని వాయిదా వేయడంతో పాటు ఢిల్లీ ప్రభుత్వానికి, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 11కి వాయిదా వేసింది. తన అనారోగ్యం కారణంగా ఈ కార్యక్రమాన్ని ఆప్ నేత, విద్యుత్ శాఖ మంత్రి అతిషి వాయిదా వేయగా.. డిజిటల్ యుగంలో ఇదేం తీరు అంటూ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఆయన లేఖ రాశారు. జస్టిస్ ఉమేశ్ కుమార్ అలహాబాద్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి. ఆయన ఢిల్లీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. వాస్తవంగా మంత్రి అతిషి సోమవారం సాయంత్రం ఈ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించాలనుకున్నారని ఢిల్లీ ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించారు. దానికి సంబంధించి జస్టిస్ ఉమేశ్‌కు సమాచారం ఇచ్చారు. దానికి ఆయన కూడా అంగీకరించారు. తర్వాత అనూహ్యంగా అతిషి అనారోగ్యానికి గురయ్యారు. దాంతో ఆ కార్యక్రమం కాస్తా గురువారానికి వాయిదా పడింది. కార్యక్రమం వాయిదావేయడాన్ని వివాదం చేసేందుకు ఎల్జీ ప్రయత్నించారు. సుప్రీంకోర్టు జోక్యంతో ఆయన యత్నాలు సాగలేదు.

కస్టడీ పిటిషన్ ఉపసంహరణకు టీఎంసీ నేతకు అనుమతి

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో పశువుల అక్రమ రవాణాకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో జైలులో కొనసాగుతున్న తన కస్టడీ చట్టవిరుద్ధమని పేర్కొంటూ టీఎంసీ నేత అనుబ్రత మోండల్ తన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు ఢిల్లీ హైకోర్టు మంగళవారం అనుమతించింది. న్యాయమూర్తి సిద్ధార్థ్ మృదుల్ నేతృత్వంలోని ధర్మాసనం మోండల్‌ను జ్యుడీషియల్ కస్టడీలో ఉంచడానికి చెల్లుబాటు అయ్యే జ్యుడిషియల్ ఆర్డర్ లేదని వాదించిన అతని పిటిషన్ విచారించబడదని, చట్టంలో తగిన చర్యలను ప్రారంభించడానికి అతనికి స్వేచ్ఛను ఇచ్చిందని మోండల్ తరపు న్యాయవాదికి తెలిపింది. అక్రమ కస్టడీలో లేదా అక్రమ నిర్బంధంలో ఉన్న వ్యక్తిని కోర్టు ముందు హాజరుపరిచేందుకు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలయింది. 'కొన్ని వాదనల తర్వాత పిటిషనర్ తరపు న్యాయవాది చట్టం ప్రకారం తగిన విచారణను ప్రారంభించడానికి స్వేచ్ఛతో ప్రస్తుత హెబియస్ కార్పస్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతిని కోరాడు. సెలవు మంజూరు చేయబడింది. పిటిషన్ కొట్టివేయబడింది (ఉపసంహరించబడింది)' అని జస్టిస్ గౌరంగ్ కాంత్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. సుప్రీం కోర్టు నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకుని, ట్రయల్ కోర్టు ఆర్డర్ చట్టబద్ధతను సవాలు చేయడానికి అప్పీల్, హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయవచ్చని కోర్టు పేర్కొంది. 'ఏదైనా తప్పు జరిగితే, అప్పీల్ మాత్రమే ఉంటుంది. మీరు చట్టబద్ధతను ప్రశ్నించిన నిమిషం, హెబియస్ కార్పస్ అబద్ధం కాదు. మేము దానిని కొట్టివేయాలి' అని పిటిషనర్ తరపు న్యాయవాది ముదిత్ జైన్‌కు కోర్టు తెలిపింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరపు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు ఈ పిటిషన్‌ను వ్యతిరేకించారు. ఈ కేసులో గత ఏడాది ఆగస్టు 11న మోండల్‌ను సీబీఐ అరెస్టు చేసింది. గత ఏడాది నవంబరు 17న ఈడీ అరెస్టు చేసిన ఆయనను మార్చి 8 నుంచి 14 రోజుల పాటు మనీ లాండరింగ్ నిరోధక దర్యాప్తు సంస్థ కస్టడీకి పంపింది. కోట్లాది రూపాయల విలువైన పశువుల అక్రమ రవాణా రాకెట్‌లో కుమార్‌తో పాటు ఇతర ప్రభుత్వోద్యోగులు, ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం ఉందని సీబీఐ ఎఫ్ఐఆర్ పేర్కొంది.

పాము కాటుకు నవవధువు మృతి

ఉనా(యూపీ): పాము కాటుకు 22 ఏళ్ల నవవధువు చనిపోయింది. ఈ ఘటన హిమాచల్‌ప్రదేశ్‌లోని ఉనా జిల్లాలో జరిగింది. మృతురాలిని కాంచనదేవిగా గుర్తించారు. ముచ్చలి గ్రామానికి చెందిన సునీల్ కుమార్‌ను ఆమె ఇటీవలే వివాహం చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాంచనదేవి సోమవారం సాయంత్రం వంటగదిలో వంట చేస్తోంది.

ఆ సమయంలో ఆమెను పాము కరిచింది. వెంటనే ఆమెను స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో పీజీఐ ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. కుటుంబ సభ్యులు ఆమెను హోషియార్‌పూర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమె చనిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అప్పుడే విపక్షాలకు విజయం: పీకే

పాట్నా: ప్రతిపక్ష పార్టీలు వాస్తవిక దృష్టితో ముందుకు సాగితే ఎన్నికల్లో విజయం సాధించడం కష్టమేమీ కాదని, కేవలం రాజకీయంగా లెక్కలు, బలాన్ని ప్రదర్శించుకోవడం వల్ల ఫలితం ఉండబోదని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్(పీకే) మంగవారం చెప్పారు. తమ పార్టీ పెద్దది...తమకు ఎక్కువ సీట్లు అంటూ కీచులాడుకోవడం ప్రతిపక్షాల ఐక్యతకే విఘాతం కలుగుతుందని ప్రశాంత్‌కిశోర్ పేర్కొన్నారు. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో ప్రశాంత్ కిశోర్ విలేకరులతో మాట్లాడుతూ మహారాష్ట్రలో ఎన్‌సీపీ చీలిక, బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌పై సీబీఐ చార్జిషీటుకు రాజకీయ ప్రాధాన్యత ఏమీ ఉండబోదని తెలిపారు. మోదీ సర్కారు ప్రజావ్యతిరేక విధానాలకు సంబంధించిన వాస్తవాలను ప్రజలకు వివరించడం ప్రతిపక్షాలు కలిసికట్టుగా చేయాల్సిన కర్తవ్యమన్నారు. ఎమర్జెన్సీ సమయంలో జనతాపార్టీ ప్రయోగం విజయవంతమైందని, జయప్రకాశ్ నారాయణ్ ప్రజాఉద్యమంతో ఆ పార్టీ అధికారం చేపట్టిందని ప్రశాంత్‌కిశోర్ గుర్తు చేశారు. వీపీ సింగ్ పాలన సమయంలోనూ బోఫోర్స్ కుంభకోణం విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లిందని ఐప్యాక్ వ్యవస్థాపకుడు తెలిపారు. రాజకీయంగా లెక్కలు చూసుకున్నా...వాస్తవిక అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లకపోయినా...ప్రజలకు దూరమైనా రాణించడం కష్టమని ప్రశాంత్ కిశోర్ చెప్పారు.

నెల రోజుల విరామం తర్వాత ప్రశాంత్ కిశోర్ జనసూరజ్ ప్రచారాన్ని తిరిగి ప్రారంభించారు. మహారాష్ట్ర పరిణామాలపై విలేకరులు ప్రశ్నించగా ఏది సరైంది...ఏది కాదన్న విషయం ఆ రాష్ట్ర ప్రజలు నిర్ణయించుకుంటారని ఆయన తెలిపారు. అయితే, కొంతమంది ఎమ్మెల్యేలు ఫిరాయించినంత మాత్రాన ఒక రాజకీయ పార్టీ తన పునాదిని కోల్పోదని వ్యాఖ్యానించారు. ఎన్‌సీపీపై ప్రతికూల ప్రభావం ఉంటుందని తాను భావించడం లేదన్నారు.

51 ఏళ్ల తర్వాత... మహా ప్రభుత్వానికి 200 మంది మద్దతు

ముంబై: మహారాష్ట్రలో 51 ఏళ్ల తర్వాత ఓ అసాధారణ పరిస్థితి ఏర్పడింది. మహారాష్ట్ర ప్రభుత్వానికి వివిధ రాజకీయ పార్టీల నుంచి 200 మంది ఎమ్మెల్యేల మద్దతు లభించడం సుదీర్ఘకాలం తర్వాత ఇదే మొదటిసారి. ఎన్‌సీపీ నేత అజిత్ పవార్ వర్గాన్ని కేబినెట్‌లోకి తీసుకున్న తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. 1972లో ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. 200 మందికి పైగా రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నారు. అయితే, ఆ సమయంలో 222 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే కావడం గమనార్హం. ఆ సమయంలో అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్య 270. అసెంబ్లీ మాజీ అధికారి ఒకరు ఈ డేటాను మంగళవారం వెల్లడించారు. ఆదివారం ఉపముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన అజిత్ పవార్‌కు ఎంతమంది ఎమ్మెల్యేల మద్దతు ఉందో ఇప్పటికీ స్పష్టత లేదు. అయితే, మొత్తం 53 మంది శాసనసభ్యుల్లో 36 మంది మద్దతు అజిత్‌కు ఉందని ఆయన మద్దతుదారుడు, ఎమ్మెల్సీ అమోల్ మిత్కరి చెప్పారు. 'ఎక్కువ మంది ఎమ్మెల్యేలు అజిత్ పవార్‌కు మద్దతిస్తున్నారు. మేము ఇప్పటికీ ఎన్‌సీపీలో భాగమే. మేము ఫిరాయించలేదు' అని మిత్కరి తెలిపారు. మిత్కరి చెప్పింది నిజమైతే శివసేన, బీజేపీతో పాటు ప్రభుత్వానికి మద్దతిస్తున్న మొత్తం ఎమ్మెల్యేల సంఖ్య 181. 288 మంది సభ్యుల అసెంబ్లీలో బీజేపీకి 105, ముఖ్యమంత్రి షిండే నేతృత్వంలోని శివసేనకు 40 మంది సభ్యుల బలం ఉంది. బహుజన్ వికాస్ అగాదీకి చెందిన ముగ్గురు, ప్రహర్ జనశక్తి పార్టీ నుంచి ఇద్దరు, 13 మంది ఇండిపెండెంట్లు, రాష్ట్రీయ సమాజ్‌పార్టీ, జన సురాజ్య శక్తి నుంచి ఒక్కొక్కరు చొప్పున ప్రభుత్వానికి మద్దతు ఉంది. మొత్తం 201 మంది ఎమ్మెల్యేలు ఈ ప్రభుత్వానికి మద్దతిస్తున్నారు. 1990 నుంచి మహారాష్ట్ర అసెంబ్లీలో ఏ ఒక్క పార్టీ 145 మంది సభ్యులను గెలుచుకోలేదు. 1972లో కాంగ్రెస్ పార్టీ 222 మంది ఎమ్మెల్యేలను గెలుచుకుంది.

మహిళా కాంగ్రెస్ కార్యకర్తలపై
పోలీస్ జులుం

- ఖాకీలు ప్రోటోకాల్ అతిక్రమించారు: జైరాం రమేశ్
- మండుతున్న నిత్యావసర ధరలకు వ్యతిరేకంగా మహిళల ఆందోళన

న్యూఢిల్లీ: మండుతున్న నిత్యావసరాల ధరలను వ్యతిరేకిస్తూ మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పౌరులకు రెండు పూటల తిండి పెట్టలేని ప్రభుత్వం ఎందుకంటూ నిలదీశారు. దీంతో నిరసన కారులను చెదరగొట్టేందుకు ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగారు. వారిపై జులం ప్రదర్శించారు. మహిళా నిరసన కారులతో మగ పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. మహిళలను లాక్కెళ్లడం, తోసేయడం వంటివి చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి. ఈ పరిణామంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరైనా గళమెత్తితే వారిపై ఉక్కుపాదం మోపేందుకు హోంమంత్రి అమిత్‌షా పరిధిలోని ఢిల్లీ పోలీస్ వ్యవస్థ ఎప్పుడు ముందుంటుం దని విమర్శించారు. మహిళా కార్య కర్తలతో మగ పోలీసుల దురుసు ప్రవర్తన ఆక్షేపణీయమన్నారు. ఆందోళనలను అణచి వేసేందుకు, నియమాలను, పోలీసు నిబంధనావళిని అతిక్రమించేందుకు ఏ ఒక్క అవ కాశాన్ని వదులుకోరని దుయ్యబట్టారు. అన్ని ప్రోటోకాల్స్‌ను అతిక్రమించి మహిళా కాంగ్రెస్ కార్యకర్తలపైకి మగ పోలీసులను పురమాయించారు. తమకు చట్టబద్ధంగా ఉన్న ప్రజాస్వామిక హక్కును మాత్రమే కార్యకర్తలు వినియోగిం చారని జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. అయితే కాంగ్రెస్ ఆరోపణలను పోలీసు సీనియర్ అధికారి తిప్పికొట్టారు. ఆందోళన చేసేందుకు మహిళా కాంగ్రెస్ కార్యకర్తలకు అనుమతి లేదని చెప్పారు. కొన్ని విగ్రహాలను ధ్వంసం చేసేందుకు కొందరు ప్రయత్నించారని, పోలీసులను విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నారని అన్నారు. ఆందోళన స్థలిలో మహిళా సిబ్బంది ఉన్నట్లు తెలిపారు. ఇదిలావుంటే, దీనదయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లోని బీజేపీ కేంద్ర కార్యాల యం బయట మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన నిర్వహించి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని, కూరగాయాలు, పప్పుల ధరలు ఆకాశాన్నం టాయని మహిళా కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షులు నెట్టా డిసౌజా ఆరోపించారు. 'పప్పులు, పిండి, నూనె, పాలు, టమాటాలు, మిర్చి, అల్లం, మసాలాల ధరలు అమాంతం పెరిగిపోయాయి. కానీ ప్రభుత్వం మాత్రం ప్రచార్భాటాల్లో బిజీగా ఉంది. ప్రజలకు కనీసం రెండు పూటల తిండి పెట్టలేని ప్రభుత్వం ఎందుకు?' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మంగళవారం విజయవాడలోని విశాలాంధ్ర బుక్‌హౌస్‌ను సందర్శించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్‌నాయుడు ఆమెకు తమవద్ద ఉన్న పుస్తకాల గురించి వివరిస్తున్న దృశ్యం.

భోగాపురం ఎయిర్‌పోర్టుకి 'అల్లూరి' పేరు

- అమరావతిలో అల్లూరి మెమోరియల్ ఏర్పాటు చేస్తాం
- జయంతి ఉత్సవాల ముగింపు వేడుకల్లో చంద్రబాబు ప్రకటన
- అల్లూరి స్ఫూర్తితో పోరాటాలు: కె.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అమరావతిలో అల్లూరి మెమోరియల్ ఏర్పాటుతో పాటు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన నామకరణం చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. విజయవాడ ఎ కన్వెన్షన్ లో మంగళవారం అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ముగింపు ఉత్సవ కార్యక్రమంలో చంద్రబాబుతో పాటు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, జనసేన పార్టీ నాయకులు పోతిన వెంకట మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 98ఏళ్ల క్రితం 27 ఏళ్ల వయసులో చనిపోయిన వ్యక్తి అల్లూరి. అలాంటి వ్యక్తిని ఇప్పటికీ సమాజం గుర్తుపెట్టుకుంది అంటే అదీ అతని గొప్పతనం అని చెప్పారు.

చిన్న వయసులోనే ప్రజల కోసం పోరాటం చేయాలనే ఆలోచన చేసిన వ్యక్తి అల్లూరి అనీ, దాదాపు 40 గ్రామాల్లో 300 మంది గిరిజన యోధులను తయారు చేసుకుని బ్రిటీష్ వారిపై పోరాడారన్నారు. పోలీస్ స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలు సేకరించి యుద్ధం చేశాడని చెప్పారు. గాంధీ అహింసతో స్వాతంత్ర్య ఉద్యమం చేస్తే...అల్లూరి, భగత్ సింగ్, నేతాజీ సాయుధ పోరాటం ద్వారా ఉద్యమం చేశారన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్న సమయంలో....బ్రిటన్‌కు భారతీయుడు ప్రధాని అయ్యారు. ఇదీ భారత దేశం గొప్పదనం అని చెప్పారు. 2047 నాటికి ప్రపంచంలో శక్తివంతమైన జాతిగా తెలుగు జాతి తయారు అవుతుందన్నారు. అగ్రదేశంగా భారత్ ఉంటుందని చంద్రబాబు చెప్పారు. భారత దేశంలో కుల, మత వ్యవస్థలున్నాయి. కులం అనేది ఇంటికే పరిమితం అవ్వాలి...బయట మాత్రం సమాజంలో అంతా కలిసి ఉండాలి. సమాజానికి ఉపయోగపడే నేతలను మనం తయారు చేసుకుంటే మేలు జరుగుతుందన్నారు. అల్లూరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని 2014 లో జీవో ఇచ్చామని గుర్తు చేశారు. అలాగే బాలయోగి స్పీకర్‌గా ఉన్న సమయంలో ఎన్టీఆర్, అల్లూరి విగ్రహాలు పార్లమెంట్ లో పెట్టాలని లేఖ రాశామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించిన అల్లూరిని స్ఫూర్తిగా తీసుకుని, ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.